ప్రజాశక్తి
సోమవారం 8 జనవరి 2024
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ప్రజల మనిషి.. బాలకృష్ణ



బాలకృష్ణ పార్థివ దేహం వద్ద నివాళ్లర్పిస్తున్న సిపిఎం నాయకులు వైవి, లోకనాథం, జగ్గునాయుడు తదితరులు

- సిపిఎం, రైతు సంఘం నేతగా ఎన్నో పోరాటాలకు నేతృత్వం
- అనారోగ్యంతో మృతి
- అశ్రునయనాల మధ్య అంతిమ వీడ్కోలు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి, అనకాపల్లి విలేకరి

సిపిఎం బాలకృష్ణగా సుపరిచితులైన అంగులూరి బాలకృష్ణ అనారోగ్యంతో కెజిహెచ్‌లో చికిత్స పొందుతూ ఆదివారం వేకువజామున మరణించారు. దాదాపు నాలుగు దశాబ్దాలుగా విన్పించిన ఆ ప్రజా స్వరం మూగబోయింది. ఏ కష్టమొచ్చినా, ఏ సమస్యవచ్చినా బాలకృష్ణ వున్నారనే గుండె ధైర్యం కష్టజీవులకు లేకుండా మృత్యువు కబలించింది. విద్యార్థి దశలో ఎంచుకున్న పోరు మార్గంలో చివరి వరకు ఆయన నడిచి, కార్మికులు, కష్టజీవుల మనిషిగా గుర్తింపు పొందారు. డిగ్రీ చదువుతున్నప్పుడు ఎస్ఎఫ్ఐని బలోపేతం చేసిన ఆయన, పార్టీ బాధ్యతలు చేపట్టిన తరువాత పార్టీ విస్తృతికి విశేషకృషి చేశారు. సిపిఎం పార్టీ డివిజన్ కన్వీనర్‌గా, ఉమ్మడి విశాఖపట్నం జిల్లా కార్యదర్శివర్గ సభ్యునిగా చాలా కాలం పనిచేశారు. చనిపోయేనాటికి సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కో కన్వీనర్‌గా, ఎపి కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా బాధ్యతల్లో మిగతా 2లో..



బాలకృష్ణకు తుది వీడ్కోలు పలుకుతున్న ప్రజానీకం



ఫెస్ట్‌లో మాట్లాడుతున్న సినీ రచయిత సాయిమాధవ్

యువత ఆలోచనలే ప్రగతికి సోపానాలు

యూత్ ఫెస్ట్‌లో సినీ రచయిత బుర్ర సాయిమాధవ్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : యువత ఆలోచనలే ప్రపంచ ప్రగతికి సోపానాలుగా నిలుస్తాయని తెలుగు సినీ రచయిత బుర్ర సాయి మాధవ్ అన్నారు. ఆంధ్రవిశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న 37వ సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ యూత్ ఫెస్టివల్ (యూనిఫెస్ట్) 2023-24కు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివారం సాయంత్రం ఎయు కన్వెన్షన్ సెంటర్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించారు. యువత తమ లక్ష్యాన్ని,. మాతృదేశాన్ని మరువరాదన్నారు. భవిష్యత్తును నిర్మించుకునే శక్తి వారి చేతుల్లోనే ఉంటుందన్నారు. తాజా ఫెస్ట్‌లో అద్భుతమైన ప్రతిభ కలిగిన యువతను తాను చూశానని, సినీ పరిశ్రమలో నిలిచి, గెలిచే శక్తి, సామర్థ్యాలు వారికి పుష్కలంగా ఉన్నాయని అన్నారు. అనంతరం బుర్రా సాయి మాధవ్‌ను ఎఐయు అబ్జర్వర్ మనీష్ జంగ్ర సత్కరించారు. ఇదిలా ఉండగా మూడో రోజు యూత్ ఫెస్ట్ కార్యక్రమాల్లో భాగంగా ఆదివారం ఉదయం ఫోక్ ఆర్కెస్ట్రా, వెస్ట్రన్ వోకల్ సోలో, పోస్టర్ మేకింగ్, వక్తృత్వ పోటీలు, మధ్యాహ్నం భారతీయ బృంద నృత్యాలు, కొల్లాజ్, వెస్ట్రన్ ఇనిస్ట్రుమెంటల్ సోలో, రంగోలీ పోటీలను నిర్వహించారు. విభిన్న విశ్వవిద్యాలయాలకు చెందిన విద్యార్థులు తమ కళా ప్రతిభతో పోటీపడ్డారు. ఆంధ్రప్రదేశ్, మిగతా 2లో..

ఎక్కడికక్కడ జిఒ 2 ప్రతుల దగ్ధం

▶ వార్త 8లో..

సందడిగా జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

▶ వార్త 8లో..

1/2019 సర్క్యులర్ ప్రమాణాలు పాటించాలి

▶ వార్త 6లో..

జగదాంబలో జనరద్దీ



సంక్రాంతి పండగ దగ్గరపడుతుండటంతో విశాఖ నగరంలోని షాపింగ్ మాళ్లు కళకళలాడుతున్నాయి. ఎక్కడ చూసినా జనమే కనిపిస్తున్నారు. ఆదివారం సెలవు కావడంతో జగదాంబ, గాజువాక, మద్దిలపాలెం ప్రాంతాల్లో జన రద్దీ నెలకొంది. వస్త్ర కొనుగోళ్లు జోరుగా సాగాయి. ఈ నేపథ్యంలో జగదాంబ ఏరియా ఇలా జనంతో కిటకిటలాడింది.

దక్షిణం వైసిపి అస్తవ్యస్తం

- టిడిపి చేతిలో అసమ్మతి అస్త్రం
- అధికార పార్టీని వీడుతున్న కార్పొరేటర్లు, నాయకులు
- ఎమ్మెల్యే వాసుపల్లితో ఇద్దరే ఇద్దరు



ఇటీవల పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో వాసుపల్లి వెంట కనిపించని కార్పొరేటర్లు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసిపిలో అంతా అస్తవ్యస్త రాజకీయ పరిస్థితులే కనిపిస్తున్నాయి. మత్స్యకార ఓటర్లే ఇక్కడ కీలకం. ఒకే పార్టీకి అనేక మంది నేతలు ఉండటం.. వారిలో విభేదాలు, కుమ్ములాటలు కనిపించడం ఇక్కడ సర్వసాధారణ మైపోయింది. నియోజకవర్గంలో 14 మంది కార్పొరేటర్లకుగాను కేవలం ఇద్దరే ఇద్దరు అధికార పార్టీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్‌తో ఉన్నట్లు స్పష్టమవుతోంది. తెలుగుదేశం, జనసేనలోకి ఇక్కడ నుంచి నేతలు క్యూ కడుతున్నారు. వైసిపి నాయకునిగా ఉండి ఇటీవలే బయటకొచ్చిన సీతంరాజు సుధాకర్‌తో సుమారు 7 నుంచి 9 మంది కార్పొరేటర్లు కలిసి నడుస్తున్నారన్నది తెలుస్తోంది. గతంలో టిడిపి కార్పొరేటర్‌గా గెలిచిన కోడిగుడ్ల మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

దక్షిణం వైసిపి అస్తవ్యస్తం

పూర్ణిమ వైసిపిలోకి వచ్చాక రాజకీయంగా వాసుపల్లి గ్రూపులో ఉన్నారు. మరో కార్పొరేటర్ తోట పద్మావతి కూడా వాసుపల్లి గ్రూపులోనే కొనసాగుతున్నారు. వీరు తప్ప ఏ ఒక్కరూ ఎమ్మెల్యేతో లేరు. రాష్ట్ర ప్రభుత్వం పెంచిన పెన్షన్‌ను ఇచ్చే కార్యక్రమం దక్షిణంలో జరగ్గా తొమ్మిది మంది వైసిపి కార్పొరేటర్లకుగానూ కేవలం పై ఇద్దరే వాసుపల్లితో కనిపించడంతో నియోజకవర్గంలో వైసిపికి రాజకీయంగా పట్టుతప్పుతుందన్న సంకేతాలు కనిపిస్తున్నాయి.

గ్రూపులతో అధికార పార్టీకి సవాల్

నియోజకవర్గంలో కార్పొరేటర్లు 14 మంది ఉండగా టిడిపి నుంచి ముగ్గురే గెలిచారు. ఈ ముగ్గురిలో కోడిగుడ్ల పూర్ణిమ వైసిపిలో చేరారు. ఇండిపెండెంట్లుగా గెలిచిన విల్లూరి భాస్కరరావు, కందుల నాగరాజు, మహ్మద్ సాధిక్ తదితరులు తదనంతర కాలంలో వైసిపిలో చేరారు. వారిలో నాగరాజు, సాధిక్ జనసేనలోకి వెళ్లిపోయారు. సీతంరాజుతో ఉరుకూటి నారాయణరావు, బిపిన్ జైన్, చెన్నా జానకీరామ్, మేరీజోన్స్ సహా పలువురు కార్పొరేటర్లు ఉన్నారు. వీరంతా షిరిడీ టూర్‌కు ఇటీవల వెళ్లడంతో ఈ నియోజకవర్గంలో రాజకీయ ప్రకంపనలు పుట్టాయి. సీతంరాజు సుధాకర్ వీరిని వెనక నుంచి నడిపిస్తున్నారని వాసుపల్లి అనుయాయులు బాహాటంగా చెబుతున్నారు. వైసిపి కార్పొరేటర్ అయిన అప్పలరత్నం ఏ గ్రూపులోకీ వెళ్లకుండా తటస్థంగా ఉన్నట్లు భోగట్టా. ఈ నియోజకవర్గంలో జనసేన నుంచి కార్పొరేటర్‌గా తొలుత అనంతలక్ష్మి ఒక్కరే గెలిచారు. ఆ తర్వాత సాధిక్, కందుల నాగరాజు జనసేనలో చేరడంతో ఈ నియోజకవర్గంలో జనసేన కార్పొరేటర్ల సంఖ్య మూడుకు చేరింది. వైసిపి కంటే టిడిపి, జనసేన బలం దక్షిణంలో క్రమంగా పెరగడంతో 2024 ఎన్నికల్లో గ్రూపుల బెడద అధికార పార్టీకి తప్పేలా కనిపించడం లేదు.

యువత ఆలోచనలే ప్రగతికి సోపానాలు

తమిళనాడు, కేరళ రాష్ట్రాలతో పాటు కేంద్రపాలిత ప్రాంతమైన పాండిచ్చేరి నుంచి 23 విశ్వవిద్యాలయాకు చెందిన 800 మంది విద్యార్థులు ఈ యూత్ ఫెస్టివల్‌లో భాగమయ్యారు.

ఆకట్టుకున్న ఎత్నిక్ సంప్రదాయ వస్త్ర ప్రదర్శన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : 2024 సంక్రాంతి పండగను పురస్కరించుకుని హ్యాండ్ టు ఇండియా ఎగ్జిబిషన్ అండ్ సేల్ వారు స్థానిక గ్రీన్ పార్క్ హోటల్‌లో ఐదు రోజులుపాటు తలపెట్టిన ఎత్నిక్ సంప్రదాయ వస్త్ర ప్రదర్శన ఆకట్టుకుంటోంది. ఈ ప్రదర్శన 6వ తేదీ నుంచి 10వ తేదీ వరకు జరగనున్న విషయం తెలిసిందే. విస్తృత శ్రేణి వస్త్రాలు, ఉపకరణాలతో అద్భుతమైన ఈ ఎక్స్‌పోను నిర్వహిస్తున్నారు. పండుగలు, వేడుకలకు అనువైన చీరలు, సల్వార్స్, టాప్స్, లెనిన్ వస్త్రాలు, సంప్రదాయ దుస్తులు ఈ ప్రదర్శనలో అందుబాటులో ఉంటాయి. పోచంపల్లి, కలంకారి చీరలు నుంచి కొల్‌కతా, భాగల్పూరి ప్రింట్లు వరకు, లక్నో చికాన్, బనారస్ సిల్క్ చీరలు వరకు అన్నీ ఈ ప్రదర్శనలో కొలువుదీరాయి. చేనేత, ఎంబ్రాయిడరీ చేసినవి, రంగులు అద్దినవి ఇక్కడ ఉన్నాయి. కాంచీపురం నుండి తెచ్చిన బంగారు, వెండి జరీ చీరలను అందుబాటులో ఉంచారు.

ఉత్కంఠగా రంజీ మ్యాచ్

ప్రజాశక్తి - పిఎం.పాలెం : స్థానిక ఎసిఎ-విడిసిఎ ఇంటర్నేషనల్ క్రికెట్ స్టేడియం వేదికగా కొనసాగుతున్న ఆంధ్ర - బెంగాల్ జట్ల రంజీ క్రికెట్ మ్యాచ్ మూడో రోజు ఉత్కంఠతో సాగింది. అరు వికెట్లను ఆంధ్రా జట్టు కోల్పోయి 339 పరుగులను చేసింది. మిడిల్ ఆర్డర్ బ్యాట్స్‌మ్యాన్ రిక్కి బూయి సెంచరీతో చెలరేగిపోయాడు. 243 బంతుల్లో 12 ఫోర్లు, ఒక సిక్స్‌తో 107 పరుగులు చేశాడు. జట్టు కెప్టెన్ హనుమ విహారి 133 బంతుల్లో 51 పరుగులతో అర్ధ సెంచరీ చేశాడు. ఈ మ్యాచ్‌లో తొలి రెండు రోజులూ బెంగాల్ జట్టు బ్యాటింగ్ చేసిన విషయం తెలిసిందే.

బిసిలను ప్రలోభాలకు గురిచేస్తున్న ప్రతిపక్షాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : ప్రతిపక్షాలు బిసిలను ప్రలోభాలకు గురిచేస్తున్నాయని, వాటి మాటలను బిసిలు విశ్వసించవద్దని జాతీయ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సరస్వతీ పార్కు ప్రాంతంలోని ఒక హోటల్లో ఆదివారం సాయంత్రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశంలో రాష్ట్ర బిసి సంఘం కన్వీనర్ పితాని ప్రసాద్, అధ్యక్షుడు ఎన్.మారేష్, రాష్ట్ర కార్యదర్శి పాత్రుడు, యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు గోవిందు, మాజీ కార్పొరేటర్ బోదిలపాటి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

ఉత్సాహంగా విజెఆర్ కిడ్స్ టాలెంట్ షో

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విజెఆర్ సంస్థ అధ్వర్యంలో నగరంలోని ప్రముఖ హోటల్‌లో నిర్వహించిన కిడ్స్ టాలెంట్ షో చూపరులను ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో మూడు నుంచి 15 ఏళ్ల వయసుగల చిన్నారుల పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజెఆర్ సంస్థ అధినేత, నిర్వాహకురాలు కొత్తపల్లి జ్యోతి మాట్లాడుతూ ఈ పోటీలకు తల్లిదండ్రుల స్పందన కూడా బాగుందన్నారు. ఆడిషన్స్ పోటీలకు 200 మంది హాజరు కాగా, తుది పోటీలకు 40 మంది ఎంపిక అయ్యారని తెలిపారు. అందులో 9 మంది విజేతలను మూడు రౌండ్ల కింద ఎంపిక చేస్తామని వెల్లడించారు. తన కుమారుడు జ్ఞాపకార్థం ఈ పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమానికి కొణతాల భాగ్యలక్ష్మి స్పాన్సర్‌గా వ్యవహరించారు. స్థానిక ప్రముఖులు రమేష్ నాయుడు, స్వర్ణ, రామ్మోహన్, డైరెక్టర్ శివ చరణ్, సంతోషి అనూష, త్రివేణి న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు.

ప్రజల మనిషి.. బాలకృష్ణ

(మొదటి పేజీ తరువాయి..)

వున్నారు. ఆయన జీవితంలో అత్యధిక కాలం ప్రజా పోరాటాలతో పెనవేసుకుంది. అందుకే ఆయన మృతి పలువురిని దిగ్భ్రాంతికి గురిచేసింది. సిపిఎం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, కార్మిక సంఘాల నాయకులు, రైతు సంఘ నాయకులు, సహచరులు అనకాపల్లి పట్టణంలోని దాసరిగెడ్డ రోడ్డు గవరపాలెంలో ఉంచిన బాలకృష్ణ పార్థివదేహాన్ని కడసారి చూసేందుకు తరలివచ్చారు. భౌతిక కాయానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. ఆయనతో పనిచేసిన కాలంలో జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ కన్నీటిపర్యంతమయ్యారు.

అనకాపల్లిలోని కార్మిక, కర్షక నిలయం ఆ ప్రాంత పోరాట కేంద్రంగా మారాలని భావించి బాలకృష్ణ దాని నిర్మాణంలో ఎంతో కృషి చేశారు. అందుకే పార్టీ శ్రేణులు, ప్రజల సందర్శనార్థం ఆయన పార్థివ దేహాన్ని కార్మిక, కర్షక నిలయానికి తీసుకెళ్లి కొద్దిసేపు వుంచారు. ఆ తరువాత విశాఖపట్నం ఆంధ్ర మెడికల్ కళాశాల అనాటమీ విభాగానికి పార్థివ దేహాన్ని అప్పగించారు. బాలకష్ణకు ఇద్దరు సోదరులు, ముగ్గురు సోదరీమణులు, భార్య వరలక్ష్మి, కుమారుడు కౌశిక్ ఉన్నారు.

ఉద్యమాల్లో చురుగ్గా..

బాలకష్ణ అనేక ఉద్యమాల్లో చురుకుగా వ్యవహరించారు. నల్ల బెల్లం నిషేధానికి వ్యతిరేకంగా రైతులను కదలించి పోరాటాలు చేపట్టారు. గోదావరి సాధన సమితి సభ్యులుగా.. రైవాడ జలాశయం నీరు సాగు రైతులకు అందేలా, పనిచేశారు. రైతాంగ సమస్యలపై ఉద్యమించారు.

ఆదర్శ కమ్యూనిస్టు బాలకృష్ణ : లోకనాథం, హరిబాబు

కమ్యూనిస్టు ప్రమాణాలను పాటించి, ఆదర్శవంతమైన కమ్యూనిస్టు జీవితాన్ని బాలకృష్ణ గడిపారని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి కె.లోకనాథం కొనియాడారు. అనకాపల్లిలోని బాలకృష్ణ ఇంటి వద్ద జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ కష్టజీవులు, కార్మికుల పక్షాన నిలబడి పనిచేశారన్నారు. ఎపి కౌలు రైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హరిబాబు మాట్లాడుతూ కౌలు రైతుల సమస్యలపై అనేక పోరాటాలు నిర్వహించారని గుర్తుచేశారు. సిపిఐ జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకటరమణ, రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు రాంబాబు, రైతు సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కర్రి అప్పారావు, ఎం.అప్పలరాజు, నాయనబాబు, ఆళ్ళ మహేశ్వరరావు, బాలు గాడి, ఐద్వా నాయకురాలు గౌరి, దూలం బూసిరాజు, చదరం నాగేశ్వరరావు, కనిశెట్టి సురేష్ బాబు, కర్రి సుందరయ్య, రమణాజీ బాలకృష్ణతో తమకున్న అనుబంధాన్ని, ఆయన నిర్వహించిన పోరాటాలను గుర్తుచేసుకున్నారు.

పలువురు నివాళి

ఉమ్మడి విశాఖపట్నం జిల్లా నుంచి సిపిఎం నాయకులు, అభిమానులు, ప్రజా సంఘాల నాయకులు బాలకృష్ణకు ఘనంగా నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించారు. నివాళు లర్పించిన వారిలో సిఐటియు జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఆర్.శంకర్‌రావు, జి కోటేశ్వరరావు, కోశాధికారి వి.శ్రీనివాసరావు, ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ, సిపిఎం మండల కన్వీనర్ గంటా శ్రీరామ్, రంగారావు, సిపిఐ ఎంఎల్ జిల్లా కన్వీనర్ పిఎస్.అజయ్ కుమార్, కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఐఆర్.గంగాధర్, సిపిఐ నాయకులు వైయన్.భద్రం, అనకాపల్లి వర్తక సంఘం అధ్యక్షులు కొణతాల లక్ష్మీ నారాయణరావు, ఎపిఐడబ్ల్యుఎ ఛైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్, వైసిపి జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్, డైట్ కళాశాల కరస్పాండెంట్ దాడి రత్నాకర్, నూకాంబిక దేవస్థానం ఛైర్మన్ కొణతాల మురళీకష్ణ, మున్సిపల్ మాజీ ఛైర్మన్ కొణతాల జగన్నాథరావు (జగన్), బిజెపి పూర్వ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గండి వెంకట సత్యనారాయణ రావు, ప్రజాశక్తి జనరల్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు, తుమ్మపాల ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షులు సాయి లక్ష్మణ్, కోన మోహన్ రావు, అనకాపల్లి ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు బీసెట్టి అప్పారావు, హమాలీ పార్సెల్ యూనియన్ నాయకులు బి.రాజు, అంగన్వాడీ, ఆశ వర్కర్స్ యూనియన్, కూరగాయల చిల్లర వర్తక యూనియన్, ఆర్ఎఆర్ఎస్ యూనియన్, ప్రజా నాట్యమండలి, పిడిఎస్ఒ, ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ, ఐద్వా నాయకులు వున్నారు.

విశాఖలో సంతాప సభ

విశాఖ కలెక్టరేట్ : ప్రజా ఉద్యమకారుడు, ప్రజా సేవకుడు ఎ.బాలకృష్ణ అని పలువురు వక్తలు కొనియాడారు. బాలకృష్ణ భౌతికకాయాన్ని విశాఖలోని జగదాంబ సిపిఎం కార్యాలయంలో పార్టీ కార్యకర్తల సందర్శనకు కొద్దిసేపు ఉంచారు. అనంతరం జ్యోతిబసు దేహదాన ప్రోత్సాహక సంస్థ ద్వారా ఆంధ్రా మెడికల్ కాలేజీ అనాటమికి దేహదానం చేశారు. సిపిఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అధ్యక్షతన సంతాప సభ జరిగింది. పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, కె.లోకనాథం మాట్లాడుతూ బాలకృష్ణ పోరాటాలను గుర్తుచేశారు. ఆయన మృతి కార్మిక, ప్రజా, రైతు ఉద్యమాలకు తీరనిలోటు అన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు జివిఎన్.చలపతి, కిరీటం, భాగ్యలక్ష్మి, పద్మ, ఆర్‌కెఎస్‌వి.కుమార్, కెఎం.శ్రీనివాస్, ఎస్.సుధాకర్, జి..పోలేశ్వరరావు, వి.కృష్ణారావు, జ్యోతిబసు దేహదాన సంస్థ కార్యదర్శి వి.ప్రభావతి, అన్నపూర్ణ, ఎం.సుబ్బారావు పాల్గొన్నారు.

అచ్యుతాపురం : హరిపాలెం, తిమ్మరాజుపేట ప్రాంతాల్లో బాలకృష్ణ మృతికి రాజకీయాలకతీతంగా సంతాపం తెలిపారు. కార్యక్రమంలో ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు కర్రి అప్పారావు, ఎపి కౌలు రైతుల సంఘం నాయకులు కాండ్రేగుల రామ సదాశివరావు పాల్గొన్నారు.

కె.కోటపాడు : స్థానికంగా జరిగిన సంతాప కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి రొంగలి ముత్యాలనాయుడు. ప్రజా సంఘాల కన్వీనర్ ఎర్ర దేవుడు, కెవిపిఎస్ నాయకులు గాడి ప్రసాద్, అంగన్వాడీ యూనియన్ మండల నాయకులు పి.భవాని. పంచాయతీ కార్మికులు పి.సింహాచలం పాల్గొన్నారు.



అనకాపల్లి వీధుల్లో బాలకృష్ణ పార్థివదేహంతో అంతిమ ర్యాలీ

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT: VISAKHAPATNAM
M.O.P.240/2023

Between:
Sri Y.V. Trinadha Rao ...Petitioner
And
D.Siva Kalyan & Another ...Respondents

NOTICE

To,
R-1: Damerla Siva Kalyan,
S/o. D. Mallikarjuna Rao,
Hindu, aged 45 years, D.No.121-A, Beddura Complex,Ram Nagar, Pedapalli Road, Near Railway Station, Yelamanchili, Presently at Venkatapuram Village, Kokarapalli Post, 22nd Ward, Yelamanchili Muncipality, Anakapalli, Known as Visakhapatnam District.
(Driver cum owner TATA Indica Car bearing Reg. No. AP 28 AV 2910)

Please take notice that the above-named petitioner herein has filed the above M.O.P. against you and another respondent for claiming compensation and the matter stands posted to **24-01-2024** for your appearance on that day at **10:30 A.M** you should appear before the aforesaid Hon'ble Court either in person or through an Advocate without fail, else the matter will be determined in your absence, ex-parte

BODDETI RAJU, Advocate
27-10-28/4, Spring Road,
Visakhapatnam-2

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT: VISAKHAPATNAM
M.O.P. 1048/2022

Between:
Sri Dusi Narasimha Kishore ...Petitioner
And
Pyla Krishna & 2 others ...Respondents

NOTICE

To,
Respondent No.1:
Pyla Krishna, S/o.Pyla Sakuram,
Hindu, aged 46 years,
R/at D.No.9-66, Vepagunta,
Visakhapatnam-530047.

Please take notice that the above MOP is filed for seeking compensation in a sum of **Rs. 50,00,000/-** (Rupees Fifty Lakhs) for the injuries sustained by him in a motor vehicle accident that occurred on 30-04-2017 and other relieves etc., and the same stands posted to **24-01-2024** for your appearance either in person or through an Advocate at **10:30 A.M.,** failing which the matter will be heard and decided ex-parte in your absence by the Hon'ble Court.

(By Order of the Hon'ble Court)
S. ARUN DEV,Advocate
K. RAJA GOPALA RAO,
Advocates, Visakhapatnam.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE cum M.A.C.T. AT: VISAKHAPATNAM
M.O.P. 1043/2022

Between:
Smt. Dusi Hymavathi & 2 others,
Petitioners 1 & 3 are Rep. by their General Power of Attorney-
2nd Petitioner Sri Dusi Narasimha Kishore ...Petitioners
And
Pyla Krishna & 2 others ...Respondents

NOTICE

To,
Respondent No.1:
Pyla Krishna, S/o.Pyla Sakuram,
Hindu, aged 46 years,
R/at D.No.9-66, Vepagunta,
Visakhapatnam-530047.

Please take notice that the above MOP is filed for seeking compensation in a sum of **Rs.50,00,000/-** (Rupees Fifty Lakhs) for the death of deceased Dusi Dharma Rao caused in a motor vehicle accident that occurred on 30-04-2017 and other relieves etc., and the same stands posted to **24-01-2024** for your appearance either in person or through an Advocate at **10:30 A.M.,** failing which the matter will be heard and decided ex-parte in your absence by the Hon'ble Court.

(By Order of the Hon'ble Court)
S. ARUN DEV,Advocate
K. RAJA GOPALA RAO,
Advocates, Visakhapatnam.

N THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT : VISAKHAPATNAM
E.A.61/2023 in E.P.81/2017 in O.S.259/2015

Between:
Joga Seshagir Rao ...Petitioner/Claim Petitioner
And
1) Kottana Chinnathalli (Plaintiff/D.Hr)
2) Madasi Krishna Rao (Defendant/J.Dr) ...Respondents

NOTICE

To,
Respondent No.2:
Sri Madasi Krishna Rao,
Hindu, Major, R/at Flat No.301, Parvathi Residency, Chinamushidivada, Pendurthi Mandal, Visakhapatnam ...(Defendant/J.Dr)

Please take notice that the above-named Claim petitioner has instituted the above E.A before this Hon'ble Court to stay all the E.P. proceedings and the matter stands posted to **31-01-2024** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **31-01-2024** at **10:30 A.M** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

P.V.S.N. GUPTA,
P. LAKSHMI GUPTA &
S.Ch. RAO (Benny)
Advocates, Visakhapatnam.

పెందుర్తి నాయకుల్లో దడ

ప్రజాశక్తి-పెందుర్తి : ఎన్నికలు సమీపిస్తున్న వేళ రాజకీయాలు వేడెక్కుతున్నాయి. నాయకుల్లో దడ పెరుగుతోంది. పెందుర్తి నియోజకవర్గంలో టిడిపి, జనసేన, వైసిపి మధ్య త్రిముఖ పోటీ ఉంటుందని మొదట అందరూ భావించారు. పవన్‌కల్యాణ్ టిడిపితో కలిసి పోటీచేస్తామని ప్రకటించడంతో ఒక్కసారిగా టిడిపి, జనసేన నాయకుల్లో ఆందోళన ప్రారంభమైంది. సీట్ల కేటాయింపులో పెందుర్తి నియోజకవర్గం ఏ పార్టీకి వెళ్తుంది.. ఎవరికి టిక్కెట్ వస్తుంది.. అనే ఆందోళనలో జనసేన, టిడిపి నాయకుల్లో నెలకొంది. జనసేన ఏర్పాటు నుంచి శివశంకర్ కార్యకర్తల వెంట ఉండి నడిచారు. టిడిపి నుంచి బండారు సత్యనారాయణమూర్తి ఈ నియోజకవర్గం నుంచి గెలుపొంది ఉన్నారు. గత ఎన్నికల్లో ఆయన ఓటమి పాలయ్యారు. ఆయన కూడా ప్రజల్లో ఉంటూ, ప్రజా సమస్యలను తెలుసుకుంటూ నాయకులకు, కార్యకర్తలకు అందుబాటులో ఉంటూ వస్తున్నారు. ఇటీవల కాలంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల



రమేష్‌బాబు జనసేన పార్టీలో చేరారు. ఆయన గతంలో పిఆర్‌పి ద్వారా ఇదే నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందారు. జనసేనలో చేరిన పంచకర్ల రమేష్‌బాబు ఈ ఎన్నికల్లో పెందుర్తి నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతోంది. నియోజకవర్గంలో ఆయన విస్తృత పర్యటనలు కూడా చేస్తున్నారు. నియోజకవర్గంలో బైక్ ర్యాలీలు నిర్వహించారు. పెందుర్తి సీటుపై టిడిపి అధిష్టానం వద్ద బండారు సత్యనారాయణ గట్టిగా పట్టుబడుతున్నట్లు సమాచారం. పెందుర్తి నుంచే పంచకర్ల పోటీచేస్తారని ఆయన అనుచరులు గట్టిగానే చెబుతున్నారు. జనసేనను మొదటి నుంచి నమ్ముకుని ఉన్న శివశంకర్‌కు సీటు వస్తుందని ఆయన అనుచరులు చెబుతున్నారు. టిడిపి, జనసేన పొత్తుతో పెందుర్తి నియోజకవర్గం ఈ రెండు పార్టీల్లో ఎవరికి కేటాయింపు జరుగుతందోనని ఇటు ఓటర్లు, అటు రాజకీయ నాయకుల్లో తీవ్ర చర్చ నడుస్తోంది. టిడిపి, జనసేన పొత్తులో సీటు ఎవరికి ఇస్తారో చూసి అడుగు వేసేలా వైసిపి ఆలోచన కనబడుతోంది.

రెండో వార్డులో కార్పొరేటర్ పర్యటన

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డులోని పలు ప్రాంతాల్లో వార్డు కార్పొరేటర్ గాడు చిన్నికుమారి లక్ష్మి ఆదివారం పర్యటించారు. పారిశుద్ధ్య కార్మికుల సమ్మెతో పలు ప్రాంతాల్లో కాల్వల్లో మురుగు నీరు నిల్వ, రోడ్లపై పోగు బడిన చెత్త కుప్పలు దర్శనమివ్వడంతో ప్రభుత్వం వెంటనే స్పందించి పారిశుధ్య కార్మికుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని ఆమె డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు గాడు అప్పల నాయుడు, జీరు సత్యం, చిల్ల ఎర్రయ్యరెడ్డి, అప్పలరెడ్డి, సూర్రెడ్డి, జి.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



క్రికెట్ కిట్లు అందజేస్తున్న కార్పొరేటర్ కొండబాబు

క్రికెట్ కిట్లు అందజేత

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా జివిఎంసి నాలుగో వార్డు నిడిగట్టులో ఇటీవల జరిగిన క్రికెట్ పోటీల్లో గెలుపొందిన వారికి వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు ఆదివారం కిట్లు అందజేశారు. విజేతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్థానికులు శ్రీనివాసరెడ్డి, రమణారెడ్డి, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

ప్రజాశక్తి -మధురవాడ : మధురవాడ జోన్ శిష్ట కరణాల అసోసియేషన్ ఆధ్వర్యాన మధురవాడ స్వతంత్రనగర్‌లో ఆదివారం నిరుపేదలకు సంక్రాంతి పండుగ కానుకగా నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జోన్ కమిటీ పెద్దలు మాట్లాడుతూ, పేదల ఆకలి తీర్చేందుకు మధురవాడ జోన్ శిష్ట కరణాల సంఘం సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. సుమారు 150 నిరుపేద కుటుంబాలకు పంపిణీ చేశామని తెలిపారు. రానున్న రోజుల్లో మరిన్ని సేవలు అందిస్తామని చెప్పారు. కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు నౌపాడ ఆనందరావు, బివిఎస్.పాత్రో, కె.గోవిందరావు, కె.నీలకంఠేశ్వరరావు, యు.కొండలరావు, డి.మోహనరావు, బి.అనురాధ, నీలకంఠేశ్వరరావు, కె.రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నను దర్శించిన ప్రముఖులు

ప్రజాశక్తి-సింహాచలం : సింహాద్రి అప్పన్నను ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. స్వామిని దర్శించిన వారిలో భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ సిఎండి భానుప్రకాష్ శ్రీవాస్తవ్ దంపతులు, ఎపి జెన్‌కో ఎండి చక్రధర్‌బాబు దంపతులు వేర్వేరుగా దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు సాదరంగా స్వాగతం పలికారు. వీరు ముందుగా కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకున్నారు. బేడా మండపం చుట్టూ ప్రదక్షిణ చేశారు. స్వామి అంతరాలయంలోనూ, గోదాదేవి సన్నిధిలోనూ, గోత్రనామాలతో ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆస్థాన మండపంలో అర్చకులు ఆశీర్వదించారు.

అనంత పద్మనాభస్వామిని దర్శించుకున్న అమర్‌నాథ్

ప్రజాశక్తి- పద్మనాభం : పద్మనాభంలోని అనంత పద్మనాభస్వామిని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ దర్శించుకున్నారు. కొండ దిగువన ఉన్న కుంతి మాధవ్‌స్వామికి వెన్నతో అలంకరణ కార్యక్రమం, నవనీయతోత్సవాన్ని దర్శించుకుని పూజలు నిర్వహించారు. పద్మనాభం వచ్చిన మంత్రి అమర్‌నాథ్‌కు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకరి గిరిబాబు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంత పద్మనాభ స్వామి చిత్రపటాన్ని మంత్రికి అందించారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం సర్పంచ్ తాలాడ పాప, వైసిపి నాయకుడు తాలాడ పద్మ తదితరులు పాల్గొన్నారు.

కుంతీ మాధవ స్వామిని దర్శించిన ప్రముఖులు

పద్మనాభంలోని కుంతీమాధవ స్వామి ఆలయంలో ఆదివారం నవనీత ఉత్సవం, వెన్నతో అలంకరించిన కార్యక్రమాన్ని పురోహితులు సీతారామాంజనేయులు బృందం ఘనంగా నిర్వహించారు. ఎంపిపి కె.రాంబాబు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భీమిలి తెలుగుదేశం ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అభిషేకాలు చేయించుకున్నారు.

శిల్పారామంలో శాస్త్రీయ, జానపద నృత్యాలు

ప్రజాశక్తి- పిఎం.పాలెం : వారాంతపు సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా మధురవాడ శిల్పారామంలో వారాహి కూచిపూడి అకాడమీచే శాస్త్రీయ, జానపద కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మి సుమనస వందిత, వేయి నమాల వాడ, ఇదిగో భద్రాద్రి, ముద్దుగారే యశోద, అఖిలాండేశ్వరి, మూషిక వాహన, మహా గణపతిం, హర హర శంభో, ఇట్టి ముద్దులాడ, శివ శివశంకర హరహర శంకర అంశాలను ప్రదర్శించారు.

అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యాచరణపై సమావేశం



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

ప్రజాశక్తి -మధురవాడ : డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ 125 అడుగుల విగ్రహాన్ని ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఈ నెల 19న ఆవిష్కరించనున్న నేపథ్యంలో ఎండాడలోని వైసిపి కార్యాలయంలో ఆదివారం కార్యాచరణపై సమావేశం నిర్వహించారు. వైసిపి జిల్లా అధ్యక్షులు కోలా గురువులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ రవీంద్రబాబు మాట్లాడారు. విజయవాడలో నిర్వహించే ఈ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి పార్టీ శ్రేణులు తరలిరావాలని పిలుపునిచ్చారు. దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయ సాధనలో ముఖ్యమంత్రి ముందుకెళ్తున్నారన్నారు. కోలా గురువులు మాట్లాడుతూ, అంబేద్కర్ ఆశయ సాధనకు అనుగుణంగా జగన్మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని తెలిపారు. కులమత భేదం లేకుండా పార్టీలకతీతంగా అందరికీ సమన్యాయం చేస్తున్నారన్నారు. ఈ సమావేశంలో ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు దామా సుబ్బారావు, నగరాల కార్పొరేషన్ చైర్మన్ సుజాత, నాయకులు సత్యనారాయణ, మాధవివర్మ, కారి శ్రీలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

దంత వైద్య విద్యార్థుల సాహసయాత్ర

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక సంగివలస అనిల్ నీరుకొండ దంత వైద్య కళాశాల వైద్య విద్యార్థులు ఎన్‌ఎస్‌ఎస్ సేవా పథకం ఆధ్వర్యాన ఈ నెల 6, 7 తేదీల్లో అల్లూరి సీతారామరాజు జిల్లా లంబసింగిలో సేవా శిబిరం నిర్వహించారు. 6న అక్కడ బస చేసిన విద్యార్థులు 7న ట్రెక్కింగ్ చేపట్టారు. ఈ తరహా కార్యక్రమాలు సామూహిక కలివిడి తనం, బాధ్యత పంచుకొని పనిచేయడం లాంటివి అలవడతాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎల్ వంశీకృష్ణారెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ అధికారి డాక్టర్ శివకుమార్ తెలిపారు. సామాజిక బాధ్యతతో పాటు విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెంపొందించేందుకు ఇలాంటి కార్యక్రమాలు దోహద పడతాయన్నారు.



అల్లూరి జిల్లా లంబసింగి లో వైద్య విద్యార్థుల సాహసయాత్ర

సన్ స్కూల్లో సంక్రాంతి సంబరాలు



భీమిలి సన్ స్కూల్లో భోగి మంటలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : స్థానిక సన్ స్కూల్లో ఆదివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. వారం రోజుల ముందే సంక్రాంతి వచ్చిందా అన్న అనుభూతి కలిగేలా విద్యార్థులచే ప్రదర్శించిన పులి వేషాలు, తప్పెట గుళ్లు, కొమ్మదాసు, హరిదాసు, సోదెమ్మ, బొమ్మల కొలువు ఆకట్టుకున్నాయి. కోలాటం, కోయ డ్యాన్స్, బళ్ల వేషాలు ఔరా అనిపించాయి. పిండి వంటలు, భోగి మంటలు, కోడి పందాలు ఇలా సంక్రాంతి సంబరాలు సందడి చేశాయి. స్కూల్ కరస్పాండెంట్ కె.శ్రీనివాస్ లక్ష్మీలావణ్య దంపతులు ముందుగా జ్యోతి ప్రజ్వలన చేసి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. విద్యార్థి దశలోనే భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను అలవాటు చేసుకోవాలనే ఉద్దేశంతో ఈ తరహా కార్యక్రమాలను ఏటా నిర్వహిస్తున్నట్లు స్కూల్ కరస్పాండెంట్ శ్రీనివాస్ తెలిపారు.

అన్ని వర్గాలను ఆకట్టుకోవాలి

ప్రజాశక్తి-వేపగుంట : అన్ని వర్గాలను ఆకట్టుకున్నప్పుడే వ్యాపార రంగంలో అభివృద్ధి సాధ్యమని డిప్యూటీ మేయర్ జియ్యాని శ్రీధర్ పేర్కొన్నారు. ఎన్ఎడి నుంచి కరాస మార్గంలో అమృత టిఫిన్ సెంటర్‌ను ఆదివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ధరలు అందుబాటులో ఉంచుతూ, రుచికరంగా వంటకాలను అందిస్తే వ్యాపారం ముందుకు సాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు జియ్యాని మారుతి, వినోద్, శ్రీను, సింహాద్రి, అమృత టిఫిన్ సెంటర్ అధినేత, సిబ్బంది పాల్గొన్నారు.

డిజైర్ టు డిజైన్ వార్షికోత్సవం

ప్రజాశక్తి-వేపగుంట : డిజైర్ టు డిజైన్ ఆరో వార్షికోత్సవాన్ని ఆదివారం వేపగుంటలోని మీనాక్షి కన్వెన్షన్ హాల్లో నిర్వహించారు. ముఖ్య అతిథిగా పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే పి.గణబాబు హాజరై మాట్లాడారు. సాంకేతికత, ఆధునికత భావితరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. భవన నిర్మాణ రంగంలో అనేక మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. అందుకనుగుణంగా డిజైన్ చేసి అందిస్తున్న డిజైర్ టు డిజైన్ వ్యవస్థాపకుడు శానాపతి సోమశేఖర్‌నాయుడును గణబాబు అభినందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు, జనసేన నాయకులు శివశంకర్, పిన్నింటి పార్వతి, జుత్తాడ శ్రీనివాస్, పొడ్డేపల్లి రఘు తదితరులు పాల్గొన్నారు.



వార్షికోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గణబాబు



నవ్వుకుందాం రండి అవధాన రూపకంలో పాల్గొన్న ప్రముఖులు

వినోదాల విందు

ప్రజాశక్తి-సీతమ్మధార : ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆధ్వర్యాన వినోదాల విందులో భాగంగా ఆదివారం సరదాగా నవ్వుకుందాం రండి అవధాన రూపకం 184వ ప్రదర్శన విశాఖ పౌర గ్రంథాలయంలో నిర్వహించారు. జెవిఎల్.నరసింహం, అవధాని కామేశ్వరరావు, చమత్కారకవి అప్రస్తుతం, ఎంవి.సుబ్రహ్మణ్యం సమన్వయం చేశారు. పృచ్ఛకులుగా నందూరి రామకృష్ణ సందేశం, డాక్టర్ రజని, దత్తపది, జబర్దస్త్ ప్రకాష్, అశువు దేవిడ్‌రాజు పేరడి, శివజ్యోతి, వర్ణన, తులసి, గణేష్, విచిత్ర అంశం సంధ్యా ప్రియదర్శిని, ఎస్ఎస్ నాయుడు తదితరులు ప్రశ్నల వర్షం కురిపించగా అవధాని హాస్యం జోడించి సమాధానాలతో ప్రేక్షకులను నవ్వుల్లో ముంచెత్తారు. ఈ సందర్భంగా కళాకారులు, అవధానిని ఆత్మీయ అతిథులు తిలక్ పట్నాయక్, మాల్యాద్రి, పురుషోత్తం, సన్ మూర్తి, దాడి సత్యనారాయణ సత్కరించారు. ఇటీవల రెండు సార్లు ఉత్తమ హాస్య నటుడినిగా నంది అవార్డు అందుకున్న డేవిడ్ రాజును సత్కరించారు. డేవిడ్ రాజును రంగసాయి నాటక గ్రంథాలయ వ్యవస్థాపకుడు బాదంగీర్ సాయి అభినందించారు. ఇక నుండి ప్రతినెలా ఒక హాస్య నటునికి రేలంగి ఆత్మీయ సత్కారం చేసి, వార్షికోత్సవంలో రేలంగి లైఫ్ టైం అచివ్‌మెంట్ అవార్డు ఇవ్వనున్నట్లు వ్యవస్థాపకుడు ఎంవి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ కృషి

ప్రజాశక్తి-వేపగుంట : గ్రామాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించడం ద్వారా అంధత్వ నివారణకు శంకర్ ఫౌండేషన్ ఎంతో కృషి చేస్తోందని ఆస్పత్రి డిప్యూటీ జనరల్ మేనేజర్ (పిఆర్) కమ్మెళ్ల బంగార్రాజు తెలిపారు. జిల్లా అంధత్వ నివారణ కార్యక్రమం క్రింద ఆరోగ్యశ్రీ పథకం ద్వారా అనేక కంటి సేవలను అందిస్తూ పేదల కళ్లలో వెలుగులు నింపుతోందని పేర్కొన్నారు. 2023 సంవత్సరంలో నాయుడుతోటలోని శంకర్ ఫౌండేషన్ ద్వారా 33,286 కంటి శస్త్ర చికిత్సలు చేసినట్లు తెలిపారు. 1997లో ఆసుపత్రి స్థాపించిన నుంచి ఇప్పటి వరకు 4,33,286 కంటి శస్త్ర చికిత్సలు, అంధత్వ చికిత్సలు నిర్వహించినట్లు వివరించారు. 2023లో 1,40,963 మంది అవుట్ పేషంట్లకు కంటి పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా 58 శాతానికి పైగా రోగులకు కంటి వైద్య సేవలు అందించినట్లు వివరించారు. 2023 డిసెంబరులో గ్లకోమా నివారణకు ఒక వ్యక్తికి అరుదైన "గ్లకోస్ ఐ - స్టంట్ శస్త్ర చికిత్సను ప్రప్రథమంగా శంకర్ ఫౌండేషన్ నిర్వహించి రికార్డు సృష్టించిందని పేర్కొన్నారు.

గాజువాకలో సేవలు

ఆసుపత్రి విస్తరణలో భాగంగా గాజువాక బిసి రోడ్డులో అత్యాధునిక ఆపరేషన్ థియేటర్‌తో నూతనంగా అభివృద్ధి చేసి సంక్రాంతికి పారిశ్రామిక ప్రాంత ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు తెలిపారు.

జనతా కాలనీలో ఆటోస్టాండ్ ప్రారంభం

ప్రజాశక్తి - ములగాడ : జనతాకాలనీలో నూతన ఆటోస్టాండ్‌ను పశ్చిమ నియోజకవర్గం ఎమ్మెల్యే గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉండే ఈ ఆటో స్టాండ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సర్వసిద్ధి శ్రీలక్ష్మి, శ్రీను, జయశంకర్, కాకి పోలిరెడ్డి, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.



ఆటో స్టాండ్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గణబాబు

మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి -యంత్రాంగం

గాజువాక : సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జివిఎంసి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యాన జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట ఫుట్‌పాత్‌పై నిలబడి పారిశుధ్య కార్మికులు నిరసన తెలిపారు. ప్రజల మద్దతు కోరుతూ ప్లకార్డులను ప్రదర్శించారు. అటుగా వెళ్లే ప్రజలకు, వాహనదారులకు తమ న్యాయమైన సమస్యను వివరించారు. ఈ సందర్భంగా జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గాజువాక జోన్ కార్యదర్శి గొలగాని అప్పారావు మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చెయ్యాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని, ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్ సెమీ స్కిల్డ్ వేతనాలు చెల్లించాలని, క్లాప్ వాహన డ్రైవర్లకు రూ.18,500 ఇవ్వాలని, ఎంఎస్ఎఫ్ డ్రైవర్లకు, మలేరియా, యుజిడి, పార్క్ తదితర కార్మికులకు రిస్క్, హెల్త్ అలవెన్స్ ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో నక్కా నాగరాజు, గణేష్, కె.కిరీటం, అరుణ, సంధ్య, లక్ష్మి, తదితరులు పాల్గొన్నారు..



ఫుట్‌పాత్‌పై ప్లకార్డులు పట్టుకొని నిరసన తెలుపుతున్న కార్మికులు



నిరసన తెలుపుతున్న నీటి సరఫరా కార్మికులు

ఆరో రోజుకు నీటి సరఫరా కార్మికుల నిరసన

విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ వర్కర్ల సమ్మెలో భాగంగా జివిఎంసి వాటర్ ఫిల్టరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన నిరసన కార్యక్రమం ఆదివారానికి ఆరో రోజుకు చేరుకుంది. యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ఆనంద్ కుమార్, కార్యదర్శి డి.శేఖర్ తదితరులు పాల్గొన్నారు. పాదయాత్రలో ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

కాంగ్రెస్ వైపు దేవన్‌రెడ్డి చూపు?

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజకవర్గం వైసిపి నాయకులు, ఎమ్మెల్యే నాగిరెడ్డి కుమారుడు తిప్పల దేవన్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరుతారని గాజువాకలో ప్రచారం జరుగుతోంది. సంక్రాంతి తర్వాత ఆ పార్టీలో చేరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. వైసిపి గాజువాక నియోజవర్గ ఇన్‌ఛార్జిగా ఉన్న ఆయనకు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ఎమ్మెల్యే సీటు లేదని చెప్పడంతో, అప్పటి నుంచి ఆయన పార్టీ మారే ప్రయత్నంలో ఉన్నారు. చివరి నిమిషంలోనైనా వైసిపి నుంచి గ్రీన్‌సిగ్నల్ వస్తుందని ఎదురుచూశారు. వైవి సుబ్బారెడ్డి వచ్చి ఉరుకూటి చందును ఇన్‌ఛార్జి అంటూ స్పష్టమైన ప్రకటన చేయడంతో ఇక సీటు రాదని దేవన్‌రెడ్డి ఖచ్చితమైన నిర్ణయానికి వచ్చారు. అప్పటి నుంచి ఆయన వర్గాన్ని కొత్తగా నియమితులైన చందు వైపు వెళ్లకుండా పావులు



కదుపుతున్నారు. గతంలో ఆయన తండ్రి నాగిరెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసినప్పుడు 30000 ఓట్లు రావడం, కాంగ్రెస్‌లో చేరి నియోజకవర్గం నుంచి పోటీ చేస్తే తండ్రి ఇమేజ్‌తో పాటు, షర్మిల పార్టీ బాధ్యతలు చేపట్టి పుంజుకుంటే గెలవవచ్చు అనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. ఈ ఎన్నికల్లో గెలవకపోయినా కేడర్ జారిపోకుండా ఉండేందుకైనా పోటీకి సిద్ధపడుతున్నట్లు తెలుస్తోంది. జనసేన, టిడిపిలోకి వెళ్లినా గాజువాక నియోజవర్గం సీటు వచ్చే అవకాశం లేకపోవడంతో కాంగ్రెస్ పార్టీ అయితే టిక్కెట్ దక్కించుకోవచ్చనే బలమైన నమ్మకంతో ఉన్నారు. గత పది రోజులుగా పాత కాంగ్రెస్ నాయకుల ద్వారా మంతనాలు జరుపుతున్నారు. ఈయన దగ్గర ఉన్న అనుచరులను కూడా సలహాలు అడిగి తెలుసుకుంటున్నారు. ఏమి జరుగుతుందో వేచి చూడాల్సి ఉంది.



రాజాబాబుకు కాంగ్రెస్ కండువా వేస్తున్న ముత్యాలు

కాంగ్రెస్ బలోపేతానికి కృషి

ప్రజాశక్తి -గాజువాక : కాంగ్రెస్ బలోపేతానికి కృషిచేయాలని ఆ పార్టీ గాజువాక నియోజవర్గ సమన్వయకర్త జెర్రిపోతుల ముత్యాలు పిలుపునిచ్చారు. పెదగంట్యాడ హెచ్‌బి.కాలనీకి చెందిన ములకాలపల్లి రాజాబాబు ఆదివారం ముత్యాలు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ముత్యాలు మాట్లాడుతూ, కాంగ్రెస్‌తోనే దేశ అభివృద్ధి సాధ్యమన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ వార్డు అధ్యక్షులు యరబాల భూలోక, కట్టా అప్పారావు, శనివాడ హరిబాబు, ఎంఎస్.వర్మ పాల్గొన్నారు.

బ్యాటరీ సైకిళ్లతో పర్యావరణ పరిరక్షణ

ప్రజాశక్తి-సీతమ్మధార : బ్యాటరీ సైకిళ్లతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చని బుల్లయ్య కాలేజీ కరస్పాండెంట్ మధుకుమార్ అన్నారు. బుల్లయ్య కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకల సందర్భంగా కళాశాల విద్యార్థులు తయారుచేసిన 50 బ్యాటరీ సైకిళ్లతో సిరిపురం, ఆశీల్‌మెట్ట, ఆర్‌కె.బీచ్ వరకు 10 కిలోమీటర్లు ప్రయాణించారు.

వైజాగ్ ఫిల్మ్ సొసైటీ సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-సీతమ్మధార : వైజాగ్ ఫిల్మ్ సొసైటీ వార్షిక సర్వ సభ్య సమావేశం ఆదివారం డాక్టర్ ఎల్‌బి.కాలేజీ ప్రాంగణంలోని గాంధీ సెంటర్ సెమినార్ హాల్లో ఆచార్య ఎన్ఎడి.పాల్ అధ్యక్షతన నిర్వహించారు. కార్యదర్శి నివేదికను నరవ ప్రకాశరావు సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కమర్షియల్ సినిమాలు కాకుండా సమాంతర సినిమాలు ప్రదర్శించాలనే ఉద్దేశంతో ఏర్పడిన సొసైటీ ఆ దిశగా పయనించడం వల్లనే 20 ఏళ్లుగా సంస్థ మనుగడ సాగిస్తోందని తెలిపారు. అనంతరం సభ్యులకు ఉపాధ్యక్షులు కాశీ విశ్వేశ్వరరావు నూతన డైరీలు అందజేశారు. ఫిబ్రవరి 6వ తేదీన తెలుగు టాకీ సినిమా ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా మూడు రోజుల ఫిల్మ్ ఫెస్టివల్ జరపాలని, ఫిల్మ్ డెవలప్‌మెంట్ ఛైర్మన్ పోసాని కృష్ణమురళిని పిలవాలని తీర్మానించారు. కార్యక్రమంలో పికె.బోస్, బి.చిన్నారావు, హుస్సేని శివకుమార్, అప్పారావు, ఆనంద్‌బాబు, కృష్ణారావు, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

గాజువాకలో 3కె మారథాన్

ప్రజాశక్తి -గాజువాక : పల్లా కార్తీక్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన గుండెను కాపాడుకుందాం అనే నినాదంతో గాజువాకలో ఆదివారం 3కె మారథాన్ నిర్వహించారు. పాత గాజువాక 60 అడుగుల రోడ్డులోని యశోద పాఠశాల నుంచి ప్రారంభమైన మారథాన్ సినిమా హాలు కూడలి, కొత్త గాజువాక పెట్రోల్ బంక్ వరకు సాగి మరలా పాత గాజువాక వరకు నిర్వహించారు. యువత, స్వచ్ఛంద సంస్థలు, పౌర సంఘాలు, వివిధ పాఠశాలలు, కళాశాలల విద్యార్థులు వేలాదిగా తరలివచ్చి నినాదాలతో హోరెత్తించారు. ట్రస్ట్ అధ్యక్షుడు పల్లా కార్తీక్ మాట్లాడుతూ, సంపూర్ణ ఆరోగ్యం కోసం ప్రతిరోజూ ఉదయం వ్యాయామం తప్పనిసరి అని అన్నారు. నడక, పరుగులు తీస్తూ వ్యాయామం పేరిట శ్రమపడితే గుండెను కాపాడుకున్నట్లవుతుందని



గాజువాకలో మారథాన్‌లో పాల్గొన్న విద్యార్థులు

పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఇంటా మొక్కలు నాటాలనే నినాదంతో త్వరలో మరో కార్యక్రమాన్ని చేపడతామన్నారు. ఈ సందర్భంగా నడకలో పాల్గొన్న వారికి టీ షర్టులు, టోపీలు అందజేశారు. విద్యార్థులను అభినందిస్తూ సర్టిఫికెట్‌లను ప్రదానం చేశారు.

ఎస్మాను తక్షణమే రద్దుచేయాలి

విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజాసంఘాలు

ప్రజాశక్తి - కలెక్టరేట్ : వైసిపి ప్రభుత్వం అంగన్‌వాడీల సమ్మె అణచివేతకు ఎస్మా చట్టాన్ని ప్రయోగించడాన్ని విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాలు తీవ్రంగా వ్యతిరేకించాయి. తక్షణమే ఈ చట్టం జిఒ నెంబరు 2ను రద్దు చేయాలంటూ ఆదివారం జగదాంబ జంక్షన్‌లో జిఒ ప్రతులను ఆ సంఘాల నాయకులు దగ్ధం చేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ మాట్లాడుతూ సమ్మెపై నిర్బంధాన్ని ఖండించారు. గతంలో చంద్రబాబు నాయుడు, తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి జయలలిత ఈ రకంగానే కార్మిక పోరాటాలను అణిచివేసేందుకు, ఉద్యోగులపై వేటు, ఎస్మాను ప్రయోగించడంతో ఆ ప్రభుత్వాలనే కోల్పోయారన్నది జగన్‌మోహన్‌రెడ్డి గుర్తుంచుకోవాలన్నారు.

సిపిఎం విశాఖజిల్లా కార్యదర్శి ఎం.జగ్గు నాయుడు, ఎఐటియుసి జిల్లా నాయకులు పడాల రమణ, ఎఐసిటియు నాయకులు దేవా, ఐఎఫ్‌టియు నాయకులు



జిఒ 2 ప్రతులను దగ్ధం చేస్తున్న కార్మిక, ప్రజాసంఘాల నేతలు

కె.మల్లన్న, సిఐటియు నాయకులు వై.రాజు, వి.కృష్ణారావు, కె.నర్సింగరావు, ఎం.సూరీడు, ఎం.కామేశ్వరరావు, జి.పోలేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎల్‌జె.నాయుడు, మణికంఠ, డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సంతోష్, కె.గణేష్ తదితరులు పాల్గొన్నారు.

9న నిరసన ప్రదర్శన

అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెపై ఉక్కుపాదం మోపుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించడాన్ని ఖండిస్తూ మంగళవారం ఉదయం 10 గంటలకు డాబాగార్డెన్స్ బిఆర్.అంబేద్కర్ విగ్రహం నుంచి అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన జరుగుతున్నట్లు జెఎసి ఛైర్మన్ ఎం.జగ్గునాయుడు తెలిపారు. జెఎసి సమావేశం ఆదివారం జగదాంబ దరి సిఐటియు జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జగన్ ఎస్మా ప్రయోగించి ఉక్కుపాదం మోపడం సిగ్గుచేటన్నారు. మున్సిపల్ కార్మికులను, సమగ్రశిక్ష ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామన్న హామీని తుంగలో తొక్కుతున్నారన్నారు. ప్రభుత్వం నిర్బంధాలకు పోకుండా తక్షణమే కార్మికుల సమ్మె డిమాండ్లను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. జెఎసి నాయకులు పాల్గొన్నారు.

చోడవరం నుంచి మళ్లీ పోటీ


సమావేశంలో మాట్లాడుతున్న ధర్మశ్రీ

ప్రజాశక్తి- చోడవరం: చోడవరం అసెంబ్లీ స్థానం నుంచి తాను పోటీ చేస్తున్నానని, విభేదాలను పక్కనబెట్టి వైసిపి శ్రేణులంతా సమిష్టిగా తన గెలుపునకు కృషి చేయాలని చోడవరం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ కోరారు. ఆదివారం అంబేరుపురం తులసి కల్యాణ మండపంలో నాలుగు గ్రామాల వైసిపి కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ, పార్టీ కార్యకర్తల్లో గ్రామాల్లో విభేదాలు పక్కనపెట్టి వైసిపి విజయమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. ఇప్పటికే నియోజకవర్గంలో సుమారు రూ.18 కోట్ల తో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టానన్నారు. మరో అవకాశమిస్తే మరిన్ని నిధులను తీసుకొచ్చి, నియోజకవర్గాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దుతానన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు, మార్కెట్ కమిటీ ఛైర్మన్ ఏడువాక సత్యారావు, దొడ్డి వెంకటరమణ, మొలి స్వామి నాయుడు ఎంపి నాగేశ్వరరావు, పిల్లల గోవిందు, నక్క ఆనంద్ పాల్గొన్నారు. వైసిపి మండల ఉపాధ్యక్షుడిగా నియామకమైన చవితిన బాబూరావును ఎమ్మెల్యే సన్మానించారు.

మాతృత్వ మమకారం


చనిపోయిన కుక్కపిల్ల వద్ద రోజంతా విలపిస్తున్న తల్లి కుక్క

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : రోడ్డు ప్రమాదంలో పిల్ల చనిపోతే, తల్లి కుక్క పడిన మనోవేదన, పప్పీ మృతదేహం వద్ద విలపిస్తూ తల్లి కుక్క వేదన, ఆరాటం అక్కడ చూపరులను సైతం కంట తడిపెట్టింది. ప్రేమ, మమకారం, మాతృత్వం మనుషులకే కాదు జంతువులకూ ఉంటాయనేం దుకు నిలువెత్తు నిదర్శనంగా నిలిచిన ఘటన వివరాలివి.

కశింకోట, బంగారుమెట్ట రోడ్డులో దిబ్బిడి గ్రామం వద్ద ఆదివారం రోడ్డు దాటుతున్న ఒక కుక్క పిల్లను కారు ఢీకొనడంతో అక్కడికక్కడే చనిపోయింది. సమీపంలో ఉన్న తల్లి కుక్క పరుగు పరుగున అక్కడికి చేరుకుని రోడ్డుపై పడి ఉన్న తన పిల్లను లేపేందుకు నానా ఆరాటం పడింది. అప్పటికే ఆ కుక్క పిల్ల చనిపోవడంతో. దాని చుట్టూ తిరుగుతూ ఉదయం ఎనిమిది గంటల నుండి అక్కడే అరుస్తూ ఉండిపోయింది. ఏవైనా వాహనాలు మరణించిన కుక్క పిల్ల వైపు వస్తే, వాటి వైపు పరుగులు తీస్తూ అరుస్తూ హెచ్చరించింది. బిడ్డ మృతదేహం పక్కనే పడుకుంటూ విలపించసాగింది. గంటల తరబడి తల్లి కుక్క పడిన వేదన మాతృత్వ మమకారం పలువురు వాహనదారులను కళ్లు చెమర్చేలా చేసింది.

19వ రోజుకు 'సమగ్ర శిక్ష' సమ్మె

ప్రజాశక్తి- అనకాపల్లి : తమ సమస్యల పరిష్కారానికి 19వరోజు ఆందోళన చేస్తున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ అండ్ ఔట్సోర్సింగ్ ఉద్యోగులు ఆదివారం బైపాస్ జంక్షన్ నుంచి నాలుగు రోడ్ల కూడలి మీదుగా జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయం వరకు 100 బైకులతో ర్యాలీ నిర్వహించారు. సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని, హెచ్ఆర్ పాలసీ అమలు చేయాలనే నినాదాలతో బైక్‌లకు జెండాలు, ప్లకార్డులను కట్టి, నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని, ఇచ్చిన మాటను సిఎం జగన్, వైసిపి ప్రభుత్వం నిలబెట్టుకోవాలని యూనియన్ జిల్లా అధ్యక్షులు కట్టా కృష్ణ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ గౌరవాధ్య క్షులు పూసి వెంకటరావు, జిల్లా కార్యదర్శి గొట్టేటి నాగేశ్వరరావు, ఉపాధ్యక్షులు రామచంద్రరావు, జిల్లా ముఖ్య సలహాదారు బొడ్డేడ అచ్యుత కృష్ణ, నూకేశ్వరరావు, సతీష్, శంకరరావు పాల్గొన్నారు.

విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద ఎపి సర్వ శిక్ష కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన

అనకాపల్లిలో ఉద్యోగుల భారీ బైక్ ర్యాలీ


బైక్ ర్యాలీ చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

దీక్షలు ఆదివారానికి 19వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షులు పి.పుండరీకాక్ష, కార్యదర్శి ఎల్.చైతన్య మాట్లాడారు. జి.లక్ష్మి, ఐ.శ్రీరామమూర్తి, వినోద్, రాంబాబు, వసుమతి పాల్గొన్నారు.

టిడిపి నేతను పరామర్శించిన గంటా


నూకినాయుడు పరామర్శించిన గంటా

ప్రజాశక్తి - కశింకోట : కుడి కాలి గాయానికి ఆపరేషన్ చేయించుకుని డిశ్చార్జి అయి ఇంటికి చేరుకున్న కశింకోట మండలం చింతలపాలెం గ్రామ టిడిపి నేత జెర్రిపోతుల నూకునాయుడును మాజీ మంత్రి, విశాఖ ఉత్తర ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, అనకాపల్లి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందసత్యనారాయణ. పరామర్శించారు. ఆదివారం నూకునాయుడు ఇంటికి వెళ్లి ఆది వారం పరామర్శించారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీ, తెలుగు రైతు రాష్ట్ర అధికార ప్రతినిధి గొంతిని శ్రీనివాసరావు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఉగ్గిని రమణమూర్తి, డిసిసిబి మాజీ డైరెక్టర్ సిదిరెడ్డి శ్రీనివాసరావు, మాజీ సర్పంచులు కర్రి దురుగు నాయుడు, బుదిరెడ్డి గంగయ్య, అచ్చర్ల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నైనాంశెట్టి రమణారావు, నారిపల్లి ప్రసాద్ ఉన్నారు.

సర్పంచ్ చొరవతో విద్యుత్ లైన్


వీధిలైట్లు వేయిస్తున్న సర్పంచ్, కోఆపరేటివ్ అధ్యక్షుడు

ప్రజాశక్తి- వడ్డాది : బుచ్చయ్యపేట మండలం, బంగారుమెట్ట దొండవారి చింతతోట నుండి శ్మశాన వాటిక అచ్చాలమ్మ పేరంటాల తల్లి గుడి వరకు సర్పంచ్ మెరుగు బాబూరావు, కోఆపరేటివ్ అధ్యక్షుడు సాయిం రమేష్ ఆధ్వర్యంలో కొత్తగా విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేసి, వాటిపై కేబుల్ లైన్ వేసి విద్యుద్దీపాలను ఏర్పాటు చేశారు. కొన్నేళ్లుగా గుడికి వెళ్లే మార్గంలో వీధిదీపాలు లేకపోవడంతో స్థానికులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి, సమస్యను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం ద్వారా కొత్తగా విద్యుత్‌లైన్‌తోపాటు వీధిదీపాలను ఏర్పాటు చేయడంపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సర్పంచ్ బాబూరావు కృషి, చొరవను అభినందించారు.

పిఎసిఎస్ ఉద్యోగుల వేతన సవరణ చేయాలి



మాట్లాడుతున్న రాష్ట్ర సెక్రటరీ సత్యనారాయణ


ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాలఉద్యోగులకు వేతన సవరణ చేయాలని యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక అన్నపూర్ణ బ్యాంక్ ఆవరణలో యూనియన్ మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ రాష్ట్రములో మూడంచెల విధానంలో ఆప్కాబ్, డిసిసిబి, పిఎసిఎస్‌లకు ఒక్కటే 'చట్టం 1964' అమలవుతున్నందున అందులో పనిచేస్తున్న ఉద్యోగులకు జీతాలు ఒకేలా ఉండాలన్నారు. అయితే తమకు రెండు దఫాలుగా పేరివిజన్ జరగకుండా ఆప్కాబ్ డిసిసిబి సిబ్బందికే అమలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. గ్రామీణ ప్రాంతాలలో సుమారు ఎనిమిది వేల మంది పిఎసిఎస్ ఉద్యోగులు, సన్న చిన్న కారు రైతులకు వ్యవసాయ, వ్యవసాయేతర ఋణాలు అందిస్తూ, ఎరువులు, పురుగు మందులు సరఫరా చేస్తూ రైతు ముంగిటికే సేవలు అందిస్తున్నామన్నారు. చాలీచాలని వేతనాలతో మగ్గిపోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. మూడంచెల సహకార వ్యవస్థలో ఉన్న దిగువస్థాయిలో ఉన్న పిఎసిఎస్ ఉద్యోగులకు మాత్రం ఎటువంటి సదుపాయాలు కల్పించలేదన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు పి. నాగభూషణం మాట్లాడుతూ పిఎసి ఎస్ ఉద్యోగుల న్యాయమైన కోర్కెలు పరిష్కరించి, ఉద్యోగులకు ప్రతి ఐదేళ్లకు ఒకసారి వేతన సవరణ చేయాలని కోరారు. జిఒ36 ప్రకారం బకాయిలతోసహా వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. జిల్లా జనరల్ సెక్రటరీ శివ రామకృష్ణ మాట్లాడుతూ ఏ ప్రభుత్వ శాఖలోనూ లేని విధంగా ఒక్క పిఎసిఎస్ వ్యవస్థలోనే సిబ్బంది జీతాలు 'డ్యూ టు' పెట్టడం దుర్మార్గమని, వెంటనే దీన్ని మార్పు చేయాలన్నారు. అసోసియేట్ ప్రెసిడెంట్ మళ్ల స్వామి, రాష్ట్ర యూనియన్ కోశాధికారి పింకె మాట్లాడుతూ పిఎసిఎస్ ఉద్యోగుల రిటైర్మెంట్ వయస్సు 62ఏళ్లకు పెంచి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మహజన సభలో జిల్లా నూతన పాలకవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర డిప్యూటీ జనరల్ శెక్రటరి ఆర్.వెంకట్రావు, కోశాధికారి ఈశ్వర రావు, కన్వీనర్ లక్ష్మణ రావు,ఉమ్మడి జిల్లా నాయకులు సూమారు 269 ఉద్యోగులు పాల్గొన్నారు.

'బైరా' దిలీప్‌కుమార్‌కు సత్కారం


బైరా ఫౌండేషన్ ఛైర్మన్ దిలీప్ చక్రవర్తిని సత్కరిస్తున్న ఆర్యవైశ్యులు

ప్రజాశక్తి-అనకాపల్లి : ఆర్యవైశ్యులు సమాజ హితులు అని బైరా ఫౌండేషన్ ఛైర్మన్ దిలీప్ చక్రవర్తి అన్నారు. ఆదివారం స్థానిక న్యూకాలనీ పోలారి చిదంబరం కళ్యాణ మండపంలో కసింకోట సింగ్ ఆధ్వర్యంలో వాసవి వనిత క్లబ్ సమావేశం నిర్వహించారు.సమావేశానికి సోదరుడు బ్రహ్మానాయుడుతో కలిసి హాజరైన దిలీప్ చక్రవర్తి మాట్లాడుతూ ఆర్యవైశ్యులు సమాజానికి ఎన్నో విధాలుగా సహాయ సహకారాలు అందిస్తారన్నారు. ఈ సందర్భంగా దిలీప్‌ను మనస్ఫూర్తిగా ఆశీర్వదించిన ఆర్యవైశ్యులు పెద్దలు, ఆతామంతా అండగా ఉంటామని భరోసానిచ్చారు. ఆర్యవైశ్యులు సమాజాన్ని దిలీప్ చక్రవర్తిలా ఏ ఒక్కరూ అర్థం చేసుకోలేదని, దిలీప్‌కు మరిన్ని విజయాలు చేకూరాలని ఆకాంక్షించారు.

ఉపముఖ్యమంత్రిని కలిసిన భరత్



బూడికి పుష్పగుచ్ఛం ఇస్తున్న భరత్‌కుమార్

ప్రజాశక్తి- కశింకోట : ఉపముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడును అనకాపల్లి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి అభినందించారు. ఆదివారం తారువలోని మంత్రి స్వగృహానికి తల్లిదండ్రులు, కుటుంబసభ్యులతోపాటు వైసిపి నేతలతో కలిసి వెళ్లి బూడిని కలిశారు.ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి బూడి మాట్లాడుతూ, వైసిపి ప్రభుత్వం మంచి అవకాశాన్ని ఇచ్చిందని, దాన్ని సద్వినియోగం చేసుకుని, పార్టీకోసం, ప్రజల కోసం పనిచేసి మంచి పేరు తెచ్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో భరత్ తల్లిదండ్రులు తల్లిదండ్రులు విశాఖ డెయిరీ డైరెక్టర్ మలసాల రమణారావు, మాజీ జెడ్‌పిటిసి మలసాల ధనమ్మ, పలకా రవి ఉన్నారు.

పలుచోట్ల రక్తదాన శిబిరాలు



రక్తదానం చేస్తున్న యువకులు

ప్రజాశక్తి -అచ్యుతాపురం: రీచింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సంస్థ ఆధ్వర్యంలో ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఆదివారం రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. ఈ శిబిరంలో ఎపి సిపిఎస్ఈఎ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం త్రినాధస్వామి రక్తదానం చేశారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రతి ఒక్కరూ రక్తదానం చేయడం ద్వారా ప్రమాదాల్లో గాయపడిన వారికి ప్రాణదాతలు కావాలని ఆకాంక్షించారు18 సంవత్సరాల నుండి 60 ఏళ్ల లోపు వయసుగల ఆరోగ్యవంతమైన వారు ప్రతి మూడు నెలలకు ఒకసారి రక్తదానం చేయవచ్చని సూచించారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

34 యూనిట్ల రక్తం సేకరణ

కశింకోట : కశింకోట సత్యానగర్ కాలనీ యూత్, 'మేము సైతం సమాజం కోసం' సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈసందర్భంగా స్వచ్ఛందంగా వచ్చిన దాతల నుంచి 34 యూనిట్ల రక్తం సేకరించారు. విశాఖపట్నం విజయశ్రీ బ్లడ్ బ్యాంక్ సౌజన్యంతో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పెద్ద ఎత్తున యువకులు పాల్గొన్నారు.



రక్తదాతలకు సర్టిఫికెట్లను ఇస్తున్న నిర్వాహకులు

వెంకన్నను దర్శించుకున్న ఆళ్ల దంపతులు



ఆళ్ల దంపతులను సత్కరిస్తున్న గోవింద్

ప్రజాశక్తి- అనకాపల్లి: అనకాపల్లి భోగిలింగేశ్వర స్వామి దేవస్థానం చైర్మన్ ఆళ్ల నాగేశ్వర రావు దంపతులు శనివారం ధనుర్మాసం సందర్భంగా దేవుని గుమ్మం వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు.ఈ సందర్భంగా శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయ చైర్మన్ సకల గోవింద్ ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు వేద ఆశీర్వచనం చేసి ప్రత్యేకపూజలు చేయించారు.

సమిష్టి పోరాటంతో సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న మండల సంఘం నాయకులు కాశి

ప్రజాశక్తి - బుచ్చయ్యపేట : వికలాంగులంతా ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, సమిష్టి పోరాటంతో సమస్యలను పరిష్కరించుకుందామని వికలాంగుల సంక్షేమ సంఘం మండల నాయకులు ముమ్మిడిశెట్టి కాశీబాబు అన్నారు. ఆదివారం మండలంలోని రాజాం మరిడిమాంబ గుడి వద్ద వికలాంగుల ఆత్మీయ సమావేశం జరిగింది ఈ సందర్భంగా మాట్లాడుతూ వికలాంగులకు నిర్లక్ష్యానికి గురవుతున్నారన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. వికలాంగుల కార్యాలయాన్ని విజయనగరం తరలించడం వల్ల విశాఖ ఉమ్మడి జిల్లాలో వికలాంగులు సంక్షేమ పథకాలకు దూరమౌతున్నారన్నారు. అనకాపల్లి కేంద్రంలో వికలాంగుల సంక్షేమశాఖ జిల్లా ఏడీ కార్యాలయాన్ని ఏర్పాటు చేయాలని కోరారు. సదరం సర్టిఫికెట్ ఉన్న వికలాంగులకు అంత్యోదయ కార్డులు అందజేసి, 35 కేజీల రేషన్ బియ్యాన్ని ఉచితంగా ఇవ్వాలని, రైలు, బస్ ప్రయాణాల్లో వందశాతం టిక్కెట్ రాయితీ కల్పించాలని, వికలాంగుల పింఛనును వైకల్యం పర్సంటేజతో ముడిపెట్టకుండా అందరికీ రూ.ఐదు వేలు ప్రతినెలా అందజేయాలని డిమాండ్ చేశారు.

1/2019 సర్క్యులర్ ప్రమాణాలు పాటించాలి

ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఆర్‌టిసిలో కార్మికులకు కొంతమేరకైనా ఉద్యోగ భద్రత ఇస్తున్న 1/2019 సర్క్యులర్ ప్రమాణాలను యాజమాన్యం పాటించాలని స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్.సుందరయ్య డిమాండ్ చేశారు. యూనియన్ విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం జగదాంబ జంక్షన్ సిఐటియు కార్యాలయంలో సదస్సు జరిగింది. దీనికి సంఘం విశాఖ జిల్లా అధ్యక్షులు పి.సూర్యనారాయణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సుందరయ్య మాట్లాడుతూ అనేక పోరాటాలు, విజ్ఞప్తుల మూలంగా వచ్చిన 1/2019 సర్క్యులర్ వల్ల కొంతమేరకైనా ఉద్యోగ భద్రత వచ్చిందని కార్మికులు ఉత్సాహపడ్డారన్నారు. కానీ ఇప్పుడు ఈ సర్క్యులర్‌ను రద్దు చేయాలని యాజమాన్యం ఆలోచిస్తున్నట్లుగా కనిపిస్తోందన్నారు. ఇది తగదన్నారు. సదస్సులో సంఘం జోనల్ కార్యదర్శి ఎంసిహెచ్.అప్పడు. ఆర్టీసీ ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ జిల్లా కార్యదర్శి ఎస్.ఎ.రావు, జోనల్ ప్రెసిడెంట్ వి.రాములు, గౌరవాధ్యక్షులు కెఆర్.కుమార్ పాల్గొన్నారు.

ఘనంగా డిసిసి అధ్యక్షుడు శ్రీనివాస్ జన్మదిన వేడుకలు



బొడ్డు శ్రీనివాసరావును సత్కరిస్తున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు 53వ జన్మదిన వేడుకలు ఆదివారం పట్టణం లో ఘనంగా జరిగాయి. ముందుగా కేక్ కట్ చేసి అనంతరం దుశ్శాలువా, మెమెంటోతో సత్కరించారు ఈ సందర్భంగా అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ కాంగ్రెస్ కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు న్యాయవాది ఐఆర్.గంగాధర్ మాట్లాడుతూ బొడ్డు శ్రీనివాసరావు నాయకత్వంలో జిల్లాలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం అవుతుందని ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. డిసిసి అధ్యక్షులు బొడ్డు శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజశేఖరరెడ్డి కుమార్తె షర్మిల రాకతో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వచ్చిందన్నారు. వచ్చే ఎన్నికలలో ప్రభుత్వ ఏర్పాటులో కాంగ్రెస్ పార్టీ కీలకపాత్ర పోషిస్తుందని అన్నారు. అనకాపల్లి పట్టణ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు దాసరి సంతోష్, అనకాపల్లి మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కట్టుమ్మూరి స్వరూపారావు, కసింకోట మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు సనేడ గజ్జాలు,అనకాపల్లి మండల కమిటీ నాయకులు రాంప్రసాడ్, డి బి ఎస్ యు జిల్లా కన్వీనర్ కొల్లి సత్యారావు మాట్లాడారు.

అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమం



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న దంతులూరి


ప్రజాశక్తి-అనకాపల్లి : తరతమ భేదం లేకుండా అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి మేలు చేసిన వ్యక్తి జగన్మోహన్ రెడ్డి ఒక్కరేనని ఎపి ఇన్ఫ్రాస్ట్రక్చర్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ దంతులూరి దిలీప్ కుమార్ అన్నారు. ఆదివారం పిసినికాడ గ్రామ సచివాలయం వద్ద నిర్వహించిన 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమంలో అనకాపల్లి సమన్వయకర్త మలసాల భరత్ కుమార్, ఎంపిపి గొర్లి సూరిబాబు, వైసిపి మండల అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిలీప్ కుమార్ మాట్లాడుతూ వైసిపి పాలనల చేపట్టిన అభివృద్ధి, సంక్షేమాన్ని వివరిస్తూ, రానున్న ఎన్నికల్లో జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. ముందుగా గ్రామంలో చేసిన అభివృద్ధి సంక్షేమం, ఖర్చుపెట్టిన నిధుల వివరాల బోర్డును ఆవిష్కరించారు. వైసిపి నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో మేలుకొలుపు

ప్రజాశక్తి -అచ్యుతాపురం : ధనుర్మాసాన్ని పురస్కరించుకుని హరిపాలెం జగ్గన్నపేట తిమ్మరాజుపేట తదితర గ్రామాల రామాలయాలలో మేలుకొలుపు కార్యక్రమాన్ని చేస్తున్నారు. వేకువజామున ఐదు గంటలకే రామాలయాలలో ప్రత్యేకమైన పూజలు చేస్తున్నారు. భక్తి పాటలు ఆలపిస్తూ నగర సంకీర్తన నిర్వహిస్తున్నారు. డిసెంబర్ నెల నుంచి సంక్రాంతి వరకు ఈ మేలుకొలుపు నిర్వహిస్తామని ఉత్సవ కమిటీలు తెలిపాయి.

దేశపాత్రునిపాలెంలో బాబు ష్యూరిటీ..

ప్రజాశక్తి - పరవాడ: జివిఎంసి 79వ వార్డు, పరవాడ మండలంలోని దేశపాత్రునిపాలెం 234, 235, 236, 237. బూత్‌లలో ఆదివారం బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. 79వ వార్డు కార్పొరేటర్, క్లస్టర్ ఇంచార్జ్ రౌతు శ్రీనివాస్, వార్డు అధ్యక్షులు మచ్చ శివకుమార్ , ఏరియా ఇంచార్జ్ కరణం అప్పారావు, డి అర్జున్, బూత్ కన్వీనర్లు రామకృష్ణ, జాజుల చిన్నారావు, గ్రామ పెద్దలు కర్రి రామానాయుడు ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి టిడిపి, జనసేన ఉమ్మడి మేనిఫెస్టోలోని సూపర్ సిక్స్ పథకాలపై వివరించి, ష్యూరిటీ రిజిస్ట్రేషన్లు చేపట్టారు.



బాబు ష్యూరిటీపై బ్రోచర్లు ఇస్తున్న టిడిపి నేతలు

కశింకోట సిఐగా వినోద్‌బాబు

ప్రజాశక్తి- కశింకోట : కశింకోట పోలీస్‌స్టేషన్ సిఐగా వినోద్‌బాబు ఆదివారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. శ్రీకాకుళం జిల్లా పాతపట్నం నుంచి బదిలీపై వచ్చారు. విజయనగరం జిల్లాకు చెందిన వినోద్‌బాబు, ఎస్‌గా రేజియన్ పరిధిలో పలు పోలీస్‌స్టేషన్లలో విధులు నిర్వహించిన తర్వాత ప్రమోషన్‌పై పాతపట్నం సిఐగా బాధ్యతలు చేశారు. అక్కడ నుంచి బదిలీపై కశింకోట వచ్చారు. ఈ సందర్భంగా సిఐ వినోద్‌బాబు మాట్లాడుతూ సిబ్బంది, ప్రజా సహకారంతో శాంతిభద్రతల పర్యవేక్షణకు కృషి చేస్తానన్నారు. రాబోయే సంక్రాంతి సంబరాల్లో ఏటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు చేపడతామన్నారు. సర్కిల్ పరిధిలో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక దృష్టి పెడతానన్నారు.

జనసేనలో చేరిక

ప్రజాశక్తి- మునగపాక: మాజీ జెడ్‌పిటిసి, గ్రామ సర్పంచ్ ఆడారి సరోజిని భర్త, సీనియర్ రాజకీయ నాయకులు ఎవి సత్యనారాయణ ఆదివారం జనసేన పార్టీలో చేరారు. స్థానిక జనసేన పార్టీ కార్యాలయంలో ఎలమంచిలి నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌ఛార్జి సుందరపు విజయ్‌కుమార్ పార్టీ కండువా వేసి ఆయనను సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యనారాయణను మండల జనసేన పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ప్రకటించారు. అనంతరం విజయ్‌కుమార్ మాట్లాడుతూ సత్యనారాయణ రాకతో మండలంలో జనసేన పార్టీకి నూతనోత్తేజం వచ్చిందన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో జనసైనికులు కష్టపడి పనిచేసి, జనసేన, తెలుగుదేశం ఉమ్మడి అభ్యర్థి విజయానికి కృషి చేయాలన్నారు. మండల ఇన్‌ఛార్జి జనపరెడ్డి శ్రీనివాసరావు, ప్రెసిడెంట్ టెక్కలి పరశురాం, ప్రధాన కార్యదర్శి కె చంద్ర మోహన్, ఉపాధ్యక్షులు మొల్లేటి ఆనంద్, జిల్లా సహాయ కార్య దర్శి ఆడారి శ్రీకాంత్, సూరిబాబు, చొప్ప శ్రీను, పాలిపిని రాము, సూరిశెట్టి అప్పలనాయుడు, ఎల్లపు సంతోష్, సరోజినీ పాల్గొన్నారు.

కొత్తపెంటలో ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని కొత్తపెంట గ్రామంలో ఆదివారం సద్గురు దేవానంద సరస్వతి మహారాజ్ 24వ ఆరాధనోత్సవాలను ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి పీఠాధిపతులు, స్వామీజీ, భక్తులు, శిష్యులు వేలాదిగా తరలిరావడంతో గ్రామంలో ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. స్వామివారిని దర్శించి, ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి అనుగ్రహం పొందారు. పీఠాధిపతుల ఆధ్యాత్మిక ప్రవచనాలు ఆకట్టుకున్నాయి . డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు దేవానంద స్వామి విగ్రహానికి పూలమాలలు వేసి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రామకృష్ణానంద స్వామి రచించిన భీమిలి వైభవం పద్య పుస్తకాన్ని ఆవిష్కరించారు. వేలాదిమంది భక్తులకు ఆశ్రమ కమిటీ సభ్యులు అన్న సమారాధన ఏర్పాటు చేశారు.కార్యక్రమంలో స్వామి విష్ణు, రామకృష్ణానంద, శ్రీను సిద్ధాంతి స్వామి, యోగానంద భారతి, మాత జ్యోతి శ్రీ దేవానంద సరస్వతి, దేవానంద స్వామి ఆధ్యాత్మిక జీవన సంఘం సభ్యులు కర్రి దేముడు, గంగు నాయుడు, నాగభూషణం, సర్పంచ్ రొంగలి వెంకటరావు (నీలిమ) చిరికి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

రాంకీ ఫార్మా వ్యర్థాలపై నిరసన

29వ రోజుకు రైతుల దీక్ష

ప్రజాశక్తి - పరవాడ: రాంకీ ఫార్మా రసాయన వ్యర్థాలతో ప్రజలకు, పంటపొలాలకు వాటిల్లుతున్న నష్టంపై రాంకీ యాజమాన్యానికి వ్యతిరేకంగా మండల కేంద్రం పరవాడ గ్రామంలో రైతులు చేపట్టిన నిరసన దీక్ష ఆదివారం 29వ రోజుకు చేరింది. రాంకీ యాజమాన్యం నిబంధనలకు విరుద్ధంగా కాలుష్యకారక వ్యర్థ రసాయనాలను అక్రమంగా కాలువల్లోకి, చెరువుల్లోకి విడుదల చేస్తూ రైతుల పొట్ట కొడుతున్నారన్నారు. వ్యర్థాలతో పంటపొలాలతోపాటు, మత్స్యసంపద నాశనం అవుతుందని, రైతులు, ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారని మండిపడ్డారు. ఈ ఫార్మా కంపెనీలు వెదజల్లే కాలుష్యం కారణంగా పరిసర ప్రాంతాల్లో నీటి వనరులు కాలుష్యం అయి, ప్రజలు క్యాన్సర్, చర్మ సంబంధిత వ్యాధులతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాంకీ సంస్థ యజమాని వైసిపి తరపున రాజ్యసభ సభ్యుడు కావడంతో ప్రజలు ఇబ్బందులను గానీ, అటువైపు కన్నెత్తి చూసే అధికారులు లేకుండా పోయారన్నారు. సమస్య శాశ్వత పరిష్కారం అయ్యే వరకు రైతులు చేపట్టే ఆందోళనకు తమ పార్టీ పూర్తి మద్దతు ఉంటుందన్నారు. రైతుల దీక్షలకు గొర్లి రామునాయుడు, పట్టాభి ప్రసాద్, సోమశేఖర్, సామాజిక వేత్త కూంద్రపు సోమునాయుడు, బండారు రాజు, చుక్క గోపి, రైతులు ఎస్ఎస్ నాయుడు, పైల నాయుడు, చుక్క తాతబాబు, పైల పైడికొండ పాల్గొన్నారు.

రోడ్డు విస్తరణలో నిబంధనల అమలేదీ?

-చిరువ్యాపారుల దుకాణాల తొలగింపు
-పెద్దల జోలికి వెళ్లని పంచాయతీ అధికారులు



తొలగించని షాపులు

ప్రజాశక్తి -కొత్తకోట:కొత్తకోటలో రోడ్డు విస్తరణ పనులు నత్త నడకన సాగుతున్నాయి. ఓ వైపు పేదల దుకాణాలు ఆగ మేఘాలు మీద తొలగించిన పంచాయతీ అధికారులు పెద్దల ఆక్రమణలు తొలగించడంలో అధికారులు మీన మేషాలు లెక్కిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. బతుకు తెరువు కోసం పంచాయతీకి చెందిన దుకాణాలు అద్దెకి తీసుకోని జీవనం సాగిస్తున్న పేదలను తొలగించి వారి జీవనాన్ని ప్రశ్నార్థకం చేసిన అధికారులు ప్రభుత్వం స్థలంలో దుకాణాలు నిర్మించి వేలకు వేలు అద్దెలు వసూలు చేసుకుంటూ సొమ్ము చేసుకుంటున్న పెద్దల జోలికి పోలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

కొత్తకోట గ్రామంలో సుమారు 100 అడుగుల మేర ఆర్ అండ్ బి తో పాటు గ్రామ కంఠంకు చెందిన స్థలం ఉంది. సుమారు 80 అడుగుల మేర రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అధికారులకు సూచించగా స్థానిక దుకాణ (ఆక్రమణలు) దారుల విజ్ఞప్తి మేరకు సుమారు 60 అడుగులకు రోడ్డు విస్తరణ కుదించారు. పలు మార్లు సమీక్షలు నిర్వహించి గత నెల రోజుల కిందట స్థానిక పెట్రోల్ బంక్ నుంచి రోడ్డు మధ్య నుంచి అటు 30 అడుగులు ఇటు 30 అడుగులకు కొలతలు వేసి పనులు ప్రారంభించారు. ఈ నేపథ్యంలో విస్తరణ పనులు చేపట్టి స్థానిక ఊర కాలవ వరకూ వచ్చి ఆగి పోయాయి. పంచాయతీ దుకాణాలలో చెప్పులు, పువ్వులు, టి. దుకాణాలు, మంగళి, ఇతర చిరు వ్యాపారాలు చేసుకొని జీవనం సాగించే పేదల



తొలగించిన షాపులు ఇవే..

దుకాణలు తొలగించారు. బడా బాబు లకు చెందిన భవనాలు జోలికి పోకుండా వారి వ్యాపారాలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా వ్యాపారాలు సాగిస్తూన్నారు. వేలకు వేలు అద్దెలు వసూళ్ళు చేసుకుంటున్నారన్న ఆరోపణలు వస్తుండగా పలు అనుమానాలు కూడా వ్యక్తం అవుతున్నాయి.

దీనిపై పంచాయతీ కార్య దర్శి కె.కృష్ణ మోహన్ ను వివరణ కోరెందుకు ప్రయత్నం చేయగా అనారోగ్యం కారణంగా శెలవు పై వెళ్లానని చెప్పారు. సర్పంచ్ కొన లోవరాజును వివరణ కోరగా ఆక్రమణల తొలగింపునకు గత నెలలో 10 రోజుల పాటు సమయం అడిగారని ఇప్పుడు సంక్రాంతి పండగ పేరుతో మరో మారు షరతు అడుగుతున్నారని తెలిపారు. పండగ అనంతరం ఆక్రమణలు తొలగింపు పనులు చేపడుతున్నట్టు సర్పంచ్ లోవ రాజు పేర్కొన్నారు. విస్తరణ పనుల్లో ఎటువంటి అనుమానాలు అక్కర లేదని స్పష్టం చేశారు.



ప్రశంసా పత్రం అందుకుంటున్న నాగేశ్వరరావు

బుద్ధుని జీవితంపై కాపారపు పరిశోధనలు

ప్రజాశక్తి -నక్కపల్లి:విశాఖ బుల్లయ్య కళాశాలలో ఈ నెల 6,7 తేదీల్లో నిర్వహించిన ఏపీ హిస్టరీ కాంగ్రెస్ సదస్సులో నక్కపల్లి మండలం చందనాడ గ్రామానికి చెందిన డిగ్రీ లెక్చరర్ కాపారపు నాగేశ్వరరావు గౌతమ బుద్ధుని జీవిత పరిశోధనల గురించి వివరించారు. క్రీస్తు పూర్వం 6వ శతాబ్దంలో జన్మించిన గౌతమ బుద్ధుడి జీవిత చరిత్రతో పాటు ఏపీలో వున్న నాగార్జున కొండ, బొజ్జన్నకొండ, అమరావతి, ప్రసిద్ధ బౌద్ధ స్థావరాల గురించి చేసిన పరిశోధనలను ఆదివారం నాటి సదస్సులో వివరించి నివేదిక సమర్పించారు. చింతపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్న కాపారాపు నాగేశ్వరరావు ఎన్నో పరిశోధనలు చేసి గుర్తింపు తెచ్చుకున్నారు. తాజాగా గౌతమ బుద్ధుడి జీవితంపై పరిశోధనలు చేసినందుకు గానూ ఏపీ హిస్టరీ కాంగ్రెస్ నిర్వాహకులు ఆయనకు ప్రశంసా పత్రాలను ఇచ్చి సత్కరించింది. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులకు తెలియజేశారు.



మెడల్ అందుకుంటున్న డేవిడ్

రాష్ట్ర స్థాయి పరుగు పందెంలో సత్తా

ప్రజాశక్తి -కోటవురట్ల: స్థానిక జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో పని చేస్తున్న ఉపాధ్యాయుడు పి.డేవిడ్ అథ్లెటిక్ పోటీల్లో భాగంగా 200 మీటర్ల పరుగు పందెంలో రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధింఆచరు. దీంతో, ఆయనకు వెండి పతకం లభించింది. ఈ సందర్భంగా మండలంలోని పలువురు ఉపాధ్యాయులు, గ్రామస్తులు మండల వాసులు ఆయనకు అభినందనలు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి



ప్రజాశక్తి -కోటవురట్ల:రానున్న సంక్రాంతి వేడుకలకు సంబంధించి మండల వాసులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని స్థానిక ఎస్సై రమణయ్య తెలిపారు. ఇటీవల బాధ్యతలు చేపట్టిన ఆయన విశాఖ నుంచి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో సమావేశంలో మాట్లాడుతూ, రానున్న సంక్రాంతి వేడుకల్లో కోడిపందాలు, పేకాటలు నిర్వహించడం చేయ రాదన్నారు. అనుమతి లేకుండా మట్టి, ఇసుక, గ్రావెల్ వంటివి అక్రమ రవాణా చేపడితే తీవ్రమైన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ప్రధాన కూడళ్ళలో ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా సహకరించాలని, చట్ట వ్యతిరేక చర్యలకు ఎవరైనా పాల్పడితే సమాచారం అందజేయాలని ఆయన సూచించారు.



ఊరేగిస్తున్న అర్చకులు

ఘనంగా వెంకన్న తిరువీధి సేవ

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రసిద్ధి పుణ్యక్షేత్రమైన ఉమాక వెంకన్న ఆలయంలో ధనుర్మాస అధ్యయనోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఆదివారం గరుడ వాహనంపై తిరువీధి సేవ అర్చక బృందం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. వెంకన్న ఉత్సవమూర్తులను గరుడ, గోదాదేవి అమ్మవారిని రాజాధిరాజ వాహనంలో అధిష్టింప చేసి గ్రామ తిరువీధి సేవ నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ప్రధానా ర్చకులు గొట్టుముక్కల వర ప్రసాదాచార్యులు, సంకర్షణపల్లి కృష్ణమాచార్యులు, పీసపాటి శేషాచార్యులు, నండూరి రాజ గోపాలాచార్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రానున్న ఎన్నికల్లో టిడిపిదే అధికారం

ప్రజాశక్తి-మాకవరపాలెం: మండలంలోని తాడపాల గ్రామంలో ఆదివారం బాబు షూరిటీ భవిష్యత్‌కు గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ మాట్లాడుతూ, రానున్న ఎన్నికల్లో టీడీపీ అధికారంలోకి రావడం ఖాయమన్నారు. చంద్రబాబు సిఎం అయితేనే రాష్ట్రం మళ్లీ అభివృద్ధి బాటలో నడుస్తుందన్నారు. వైసిపి పాలనకు రోజులు దగ్గర పడ్డాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి అయ్యన్న సతీమణి పద్మావతి, మండల పార్టీ అధ్యక్షులు ఆర్‌వై.పాత్రుడు, సర్పంచ్ అల్లు రామునాయుడు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విజయ్



చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గణేష్

సిఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:నాతవరం, నర్సీపట్నం మున్సిపాలిటీ, మాకవరపాలెం మండలాలకు చెందిన ఆరుగురు బాధితులకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఆదివారం అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గణేష్ మాట్లాడుతూ, ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ఆరుగురికి రూ.1.53లక్షల చెక్కులను అందించామన్నారు.

ప్రమాదభరితంగా కాలువ

నిర్మాణం సరే.. అంచులు పూడ్చేది ఎవరు..

ప్రజాశక్తి -కోటవురట్ల:మండల కేంద్రంలో రట్నాల పాలెం వద్ద గడపగడపకు నిధులతో గ్రామీణ నీటి సరఫరా అధికారులు పారిశుద్ధ్య పనులలో భాగంగా నిర్మించిన కాలువ నిర్మాణం పట్ల పలువురు పలు విమర్శలు గుప్పిస్తున్నారు. కాలువ నిర్మాణ నాణ్యత పక్కన పెడితే కనీసం నిర్మించిన కాలువ అంచులు పూడ్చక పోవడంతో ఏ క్షణాన ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోలేదని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. రైతులు, విద్యార్థులు, వృద్ధులు మహిళలు కాలువను దాటేందుకు అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి కాలువ నిర్మాణ అంచులు పూడ్చాలని స్థానికులు కోరారు.



అంచులు పూడ్చని కాలువ ఇదే...



ఆటలు ఆడిస్తున్న గ్రంథాలయాధికారి దమయంతి

గ్రంథాలయంలో 'చదవడం మాకిష్టం'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయధికారిణి పి.దమయంతి ఆధ్వర్యంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. టెలిస్కోప్ దినోత్సవ సందర్భంగా విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయుడు పి.ప్రభాకర్ విద్యార్థులకు టెలిస్కోప్ ప్రాముఖ్యతను వివరించారు. పిల్లలతో మాస్ రీడింగ్, నీతి కథలు చదివించారు. విద్యార్థులకు బ్యాలెన్సింగ్ ది బాల్ ఆడించి విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు. ప్రతి ఆదివారం గ్రంథాలయానికి రావాలని ఆమె విద్యార్థులను కోరారు.



గెలుపొందిన విద్యార్థులతో జెవివి ప్రతినిధులు, టీచర్స్

సందడిగా జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు

ప్రజాశక్తి-యస్.రాయవరం:మండలంలోని పెద గుమ్ములూరు హైస్కూల్‌లో జిల్లా స్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జన విజ్ఞానవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి కొలగాని వరప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు. 20 మండలాల నుండి 43 టీములు మొత్తం 153 మంది విద్యార్థులు పాల్గొన్నట్టు ఆయన తెలిపారు. ఆదివారం ం జరిగిన ఈ పోటీలలో మొదటి స్థానం శ్రీ ప్రకాష్ విద్య నికేతన్(పాయకరావుపేట), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వి.మాడుగుల),రెండవ స్థానం శ్రీ భవాని విద్యానికేతన్ (అచ్యుతాపురం),జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (వి.మాడుగుల),మూడవ స్థానం వాసవి బాలవిహార్ (అనకాపల్లి), జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కొరుప్రోలు(యస్.రాయవరం) సాధించాయయన్నారు. ఈ పోటీలలో మొదటి స్థానం సాధించిన ప్రభుత్వ, ప్రైవేటు స్కూల్ విద్యార్థులు విశాఖలో జరిగే చెకుముకి సైన్సు సంబరాలకి అర్హులని వరప్రసాద్ వివరించారు. సైన్స్ సంబరాలతో విద్యార్థులలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. జన విజ్ఞానవేదిక ప్రజా బాహుళ్యంలో విశేష ప్రజాదరణ పొందిన ఒక స్వచ్ఛంద సంస్థ అని ఆయన పేర్కొన్నారు. అంతరం విజేతలకు జిల్లా ఉప విద్యాశాఖ అధికారి అప్పారావు, జిల్లా సైన్స్ అధికారి రాజారావు, జిల్లా కార్యదర్శి రాము, ఉపాధ్యక్షులు రామ్ కుమార్ సర్టిఫికెట్లు, మెమోంటోలు అందించారు.జిల్లా స్థాయిలో మొదటి స్థానం వచ్చిన వారంతా రాష్ట్ర స్థాయిలో కుడా విజేతలుగా గెలవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు టి.నాగచంద్ర, కార్యదర్శి బి.రాము, ఉపాధ్యక్షులు బి.రామ్ కుమార్ పాల్గొన్నారు.

సిఐ అప్పలనాయుడు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-కొత్తకోట:కొత్తకోట సర్కిల్ సిఐగా ఎల్.అప్పలనాయుడు ఆదివారం బాధ్యతలు చేపట్టారు. ఇంత వరకూ సిఐ గా విధులు నిర్వహించి సయ్యద్ ఇలియాస్ మహ్మద్ రేంజ్ విఆర్‌కు బదిలీ కాగా గజపతినగరం సర్కిల్ సిఐగా విధులు నిర్వహిస్తున్న అప్పల నాయుడు ఇక్కడకు బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ.. సర్కిల్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు. గంజాయి అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. కొత్తకోటలో ట్రాఫిక్ సమస్య పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని సిఐ అప్పలనాయుడు తెలిపారు.



చోడవరం

నియోజకవర్గ అభివృద్ధికి అధిక నిధులు

ప్రజాశక్తి-రావికమతం:అనకాపల్లి జిల్లాలో అన్ని నియోజకవర్గాల కంటే అత్యధిక నిధులు తెచ్చి చోడవరం నియోజకవర్గాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన ఘనత ప్రభుత్వ విప్పు కరణం ధర్మశ్రీకే దక్కుతుందని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారి, సచివాలయ కన్వీనర్ దాసరి వరహాలు అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, చోడవరం నియోజకవర్గంలో సుమారు 1900 కోట్లతో అనేక రకాల అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం జరిగిందన్నారు.నియోజకవర్గం అభివృద్ధికి కృషి చేస్తున్న ధర్మశ్రీపై ప్రతిపక్షాలు బురద జల్లడం తగదన్నారు.అన్ని వర్గాలను కలుపుకొని పనిచేస్తున్నారని కొనియాడారు.

జిఒ 2 ప్రతుల దగ్ధం



చీడికాడలో నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



విశాఖలో జిఒ 2 ప్రతులను దగ్ధం చేస్తున్న అంగన్‌వాడీలు

ప్రజాశక్తి - విలేకర్ల బృందం

సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు చేపట్టిన సమ్మె ఆదివారం కొనసాగింది. ఎస్మాను ప్రయోగిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 2 ప్రతులను దగ్ధం చేశారు. పలు చోట్ల వినూత్న నిరసనలు చేపట్టారు.

విశాఖ కలెక్టరేట్ : సమ్మెలో భాగంగా జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద అంగన్‌వాడీల దీక్షలు కొనసాగాయి. ఎస్మా ప్రయోగిస్తూ ప్రభుత్వం విడుదల చేసిన జిఒ 2 కాపీలను శిబిరం వద్ద దగ్ధం చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవాధ్యక్షురాలు పి.మణి, అధ్యక్షురాలు వై.తులసి తదితరులు మాట్లాడారు. ఆల్ ఇండియా లాయర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.రామాంజనేయులు, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు దాసరి నాగేశ్వరరావు, టిఆర్.అంబేద్కర్‌లు అంగన్‌వాడీల సమ్మె శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. ఎస్మా ప్రయోగాన్ని తప్పుబట్టారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ తదితరులు మాట్లాడారు. దీక్షల్లో అంగన్వాడీ యూనియన్ నాయకులు ఎంవికె.పార్వతి, కె.కిరణ్మయి, ఎస్.దుర్గాదేవి, పి.లక్ష్మి, ఎస్.సింహాచలమ్మ, సుజాత, బి.రావణమ్మ, బి.శాంతి పాల్గొన్నారు.

తగరపువలస: న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని కోరుతూ అంగన్‌వాడీ వర్కర్లు, సహాయకులు స్థానిక వై జంక్షన్ వద్ద శనివారం ప్రారంభించిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం కూడా కొనసాగాయి. ఈ దీక్షా శిబిరాన్ని ఉద్దేశించి సిఐటియు భీమిలి జోన్ ప్రధాన కార్యదర్శి ఆర్‌ఎస్‌ఎన్ మూర్తి మాట్లాడుతూ, అంగన్‌వాడీలను ఎస్మా చట్ట పరిధిలోకి తీసుకొచ్చి సమ్మెను నిషేధించడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించకుండా సమ్మె నిషేధిస్తూ, సమ్మె కాలానికి జీతాల్లో కోత విధిస్తామని ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమని ఖండించారు. జివిఎంసి 1,2 వార్డుల టిడిపి అధ్యక్షులు తమ్మిన సూరిబాబు, బడిగింటి నీల కంఠం, మాజీ కౌన్సిలర్ చిలకా నరసింగరావు, తెలుగు యువత అధ్యక్షులు గరే సదానంద, నాయకులు నరవ రామారావు, గిడుతూరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొని సంఘీభావం తెలిపారు. జివిఎంసి ఒకటో వార్డు జనసేన అధ్యక్షులు పరిమి భువనేశ్వరి దీక్షా శిబిరాన్ని సందర్శించి సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు భీమిలి జోన్ అధ్యక్షులు రవ్వ నరసింగరావు, యూనియన్ నాయకులు నీలాతి రాము, ఎపి అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ (సిఐటియు) భీమిలి ప్రాజెక్ట్ అధ్యక్షులు కె.వెంకటలక్ష్మి, జిల్లా కోశాధికారి కె.పద్మావతి, భీమిలి ప్రాజెక్ట్ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీదేవి, కొవ్వాడ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



అనకాపల్లిలో...

పెందుర్తి : ఎంపిడిఒ కార్యాలయం అంబేద్కర్ విగ్రహం వద్ద అంగన్‌వాడీలు చేపట్టిన దీక్షలు రెండో రోజూ కొనసాగాయి. ఈ దీక్షలనుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అంగన్‌వాడీల సమ్మెపై రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించినా, వెనక్కు తగ్గకుండా నిరాహార దీక్షలు చేస్తున్నారని తెలిపారు. ఇలాంటి చట్టాలు ఎన్ని తెచ్చినా, గత ప్రభుత్వాలు బెదిరించినా ఐక్యంతో పోరాడి హక్కులు సాధించుకున్నామని గుర్తు చేశారు. తక్షణమే జిఒను ఉపసంహరించి, సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న అన్ని సంఘాలు, పార్టీలతో కలిసి సమస్యలపై భారీ ఎత్తున ఆందోళన చేపట్టనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా ప్రధాన కార్యదర్శి పద్మ, నాయకులు బి.అనంతలక్ష్మి, అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.బృందావతి, కార్యకర్తలు సూర్యకాంతం, జగ్గయ్యమ్మ, నాగమణి, లక్ష్మి, అప్పలనరసమ్మ, భవానీ తదితరులు పాల్గొన్నారు.



పెందుర్తిలో..

గాజువాక : అంగన్‌వాడీలపై ఎస్మా ఎత్తివేయాలని ఆంధ్రప్రదేశ్ పౌర హక్కుల సంఘం జిల్లా మాజీ అధ్యక్షులు తుంపాల శ్రీరామ్మూర్తి డిమాండ్‌చేశారు. న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలని కోరితే నిర్బంధం విధించడం సరికాదన్నారు.

సీతమ్మధార : అంగన్‌వాడాలపై ఎస్మాను ప్రయోగించడం హేయమైన చర్య అని తెలుగుదేశం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ నజీర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజా సమస్యలను గాలికి వదిలి రాజకీయాల్లో నిమగ్నమయ్యారని ఆరోపించారు. ఎస్మా ప్రయోగం జగన్మోహన్‌రెడ్డి అరాచక పాలనకు పరాకాష్ట అని పేర్కొన్నారు.

మునగపాక: అంగన్వాడీల సమ్మె భగ్నానికి ప్రభుత్వం ఎస్మా ప్రయోగంపై వారంతా తీవ్ర నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం మండల కేంద్రం మునగపాకలో అంగన్వాడీల సమ్మె దీక్ష శిబిరం వద్ద ఎస్మా జిఒ 2 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా ఎస్మాకు భయపడి వెనక్కు తగ్గేదిలేదని, తమ సమస్యలను పరిష్కరించాల్సిందేనని నినాదాలు చేశారు. అంగన్వాడీలను వేధించిన గత ప్రభుత్వాలకు పట్టిన గతే వైసిపికి, సిఎం జగన్‌కు తప్పదని హెచ్చరించారు.. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ ఎస్ బ్రహ్మాజీ, రామలక్ష్మి, జయలక్ష్మి, అంజలి, హేమలత, సరస్వతి, లక్ష్మి, తులసి, గంగాభవాని, వెంకట సత్యవతి పాల్గొన్నారు.

రాంబిల్లి : 27వరోజు అంగన్వాడీల నిరవధిక సమ్మెలో భాగంగా ఆదివారం స్థానిక తహశీల్దార్ కార్యాయలం వద్ద రాష్ట్ర ప్రభుత్వం అంగన్వాడీల సమ్మెపై ప్రయోగించిన ఎస్మా ప్రతులను దహనం చేశారు. అంగన్వాడీల పట్ల రాష్ట్ర ప్రభుత్వం ఇంత నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు దేముడు నాయుడు మండిపడ్డారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి, అంగన్వాడీల వ్యతిరేక చర్యలు మానుకొని, వారి సమస్యలను పరిష్కరించి, సమ్మె విరమణ చర్యలు చేపట్టాలని కోరారు.

ప్రజాశక్తి చీడికాడ: మండల కేంద్రంలోని చావడి వద్ద అంగన్వాడీ కార్యకర్తలు సిఐటియు ఆధ్వర్యంలో మోకాలి పై ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకురాలు జానకి రాజ్యలక్ష్మి, రామలక్ష్మి, ఉమా, పద్మ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా తక్షణమే అంగన్వాడి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఐసిడిఎస్‌ను పటిష్ట పరిచి, నాణ్యమైన సరుకులు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్లు కలిసి జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వానికి త్వరలోనే బుద్ధి చెబుతారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీలు పాల్గొన్నారు.



రాంబిల్లిలో....



తగరపువలసలో...

నాడు - నేడుతో పాఠశాలల అభివృద్ధి

ఎంపీ సత్యవతి

ప్రజాశక్తి -నక్కపల్లి:స్థానిక కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయంలో తరగతి భవన నిర్మాణాలకు ఎమ్మెల్యే గొల్ల బాబురావు, రాజాం ఎమ్మెల్యే, పాయకరావుపేట నియోజకవర్గం సమన్వయకర్త కంబాల జోగులుతో కలిసి ఎంపీ బి.సత్యవతి ఆదివారం శంకుస్థాపన చేశారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా సిఎస్‌ఆర్ ఫండ్స్ నుండి నిధులు మంజూరు చేయడంతో అసంపూర్తిగా నిలిచిన తరగతి భవన నిర్మాణ పనులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంపీ సత్యవతి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నాడు నేడుతో ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు పూర్తిగా మార్చారన్నారు. విద్యారంగానికి జగనన్న ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. విద్యారంగం అభివృద్ధికి సమూల మార్పులు తీసుకొచ్చారన్నారు. స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా మంజూరు చేసిన 30 లక్షలతో తరగతుల నిర్మాణం, టాయిలెట్స్ పనులు నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. భవన నిర్మాణ పనులు పూర్తిగా చేసేందుకు గాను మరో 30 లక్షలు మంజూరు చేయాలని స్టీల్ అథారిటీ ఇండియా వారిని అడిగినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ, సర్పంచ్ జయ రత్నకుమారి, వైస్ ఎంపీపీలు నానాజీ, ఈశ్వరరావు, మాజీ ఎంపీపీ బొల్లం బాబ్జి, ఎంఈఓ నరేష్, కేజీబీవీ ప్రత్యేక అధికారిని షేక్ షలీమా, వైసిపి నాయకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీ సత్యవతి